నిత్య వ్యాయామంతో చురుగ్గా మెదడు



పరుగులో పాల్గొన్న వారికి జ్ఞాపికలు అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్య వ్యాయామంతో మెదడు ఆరోగ్యంగా ఉంటుందని నగర పోలీసు కమిషనర్(సీపీ) శంఖబ్రత బాగ్చీ అన్నారు. న్యూరాలజీ వైద్యుల జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం బీచ్‌రోడ్డులో 'రన్ ఫర్ ది బ్రెయిన్' పేరుతో 5 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ పరుగును ప్రారంభించారు. కార్యక్రమంలో 300 మంది న్యూరాలజిస్టులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో యూజీ, పీజీ వైద్య విద్యార్థులు ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆచార్య అశోక్ పనగరియా అవార్డును బెంగళూరులోని నిమ్హాన్స్‌కు చెందిన డాక్టర్ రోహన్ ఆర్ మహాలేకు అందించారు. పుదుచ్చేరికి చెందిన డాక్టర్ సునీల్ కె నారాయణ్ బృందం న్యూరోకు చెందిన కీలక అంశాలపై ఉపన్యాసం ఇచ్చారు. న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సింపోజియంను న్యూరో సర్జరీ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఐటీ పరిశ్రమలకు ఆర్టీసీ బస్సులు

మధురవాడ, న్యూస్‌టుడే: రుషికొండ ఐటీ హిల్స్‌లోని వివిధ పరిశ్రమల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్.ఎం. బి.అప్పలనాయుడు అన్నారు. మధురవాడలోని ఆర్టీసీ డిపోను ఆదివారం ఆయన సందర్శించి పలు విభాగాల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఐటీ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ సూచన మేరకు విజయనగరం, గాజువాక, స్టీల్‌సిటీల నుంచి ఐటీ పరిశ్రమలకు ప్రతి రోజు మూడు బస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. వీటిని సోమవారం అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉందన్నారు.



మధురవాడ డిపోలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్.ఎం. అప్పలనాయుడు

నేడు జీవీఎంసీలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి సోమవారం జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేయరు గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, అనుమతులు లేని నిర్మాణాలు, టిడ్కో గృహాల కేటాయింపు తదితర సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలకు గ్రహణం!

ఈనాడు, విశాఖపట్నం

జిల్లాలో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పాత గుత్తేదారులతోనే పనులు కొనసాగిస్తున్నా ముందుకు సాగడం లేదు. బిల్లుల చెల్లింపులు ఆపకపోయినా ప్రగతి కనిపించడం లేదు. అన్ని చోట్లా అదే పరిస్థితి కనిపిస్తోంది. కలెక్టరు హరేంధిరప్రసాద్ పలుమార్లు తనిఖీలు చేపట్టి పనుల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినా లాభం లేకుండా పోతుంది. ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలని కూటమి ప్రభుత్వం ఆదేశించగా ఆ స్థాయిలో ఎక్కడా జరగక పోగా మరింత నెమ్మదిగా సాగుతున్నాయి.

పునాదుల వరకు రాని ఇళ్లు	: 3,400
ప్లింత్ దశలోనివి	: 4,811
ప్లింత్ బీమ్‌లో ఉన్నవి	: 23,787
పునాదుల వరకు నిర్మించినవి	: 28,222
లెంటిల్ దశలోనివి	: 1255
పైకప్పు వరకు వచ్చినవి	: 4,199
పైకప్పు పూర్తయినవి	: 11,798
పూర్తయిన ఇళ్లు	: 24,422

కనిపించని పనుల ప్రగతి

గత ప్రభుత్వం ఒక సెంటు ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. మూడో కేటగిరి కింద ప్రభుత్వమే నిర్మించి అప్పగించేలా ప్రజలతో ఒప్పించి గుత్తేదారులతో పనులు చేయించారు. ఈ పనులు ముందునుంచీ తూతూమంత్రంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం పాత వారితోనే పనులు చేయించాలని స్పష్టంగా చెప్పింది. మొత్తం ఇళ్లలో ఇప్పటివరకు కనీసం 30 శాతమైనా పూర్తి చేయలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గుత్తేదారులకు బిల్లుల చెల్లింపుల్లో పెద్దగా ఆలస్యం లేకపోయినా పనుల్లో వేగం కనిపించడం లేదు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి, గాజువాక ఇలా అన్ని చోట్ల ఇలానే చేస్తున్నారు.

- నత్తనడకన సాగుతున్న పనులు
- వంద రోజుల లక్ష్యం అమలులో ఘోరం


★ గత ప్రభుత్వంలో వైకాపా నేతలు బినామీ గుత్తేదారులతో కొన్ని చోట్ల పనులు చేయించారు. వాటిల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. సిమెంటు, సిమెంటు ఇటుకలు, ఇనుములో అక్రమాలకు పాల్పడ్డారు. సిమెంటు బస్తాలు అధికంగా కొనుగోలు చేసినట్లు దస్త్రాలు సృష్టించారు. ఇనుము, కార్మికులను అధికంగా వినియోగించి పనులు చేయించినట్లు చూపించారు. చాలాచోట్ల సిమెంటు పక్కదారి పట్టింది. ఇనుము, ఇసుకలోనూ అక్రమాలు జరిగినా వాటి గురించి యంత్రాంగం కనీసం దృష్టి సారించడం లేదు. బిల్లుల్లోనూ అవకతవకలకు పాల్పడినా పూర్తిస్థాయి అధికారి లేకపోవడం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఏవీ బయటపడడం లేదు.

చేయడమే లేదు..



ఆనందపురం మండలంలో ఇలా..

జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులు జరగడమే లేదనిపిస్తుంది. అధికారులు రికార్డులకే పరిమితం అవుతున్నారు తప్ప పనులు చేయించడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. ఇంకా పనులు ప్రారంభించని ఇళ్లే 36 వేలు ఉన్నాయి. పూర్తయినవి చూసుకుంటే 24 వేలే. ఇంకా కింది స్థాయిలో పనులు జరగాల్సిన ఇళ్ల నిర్మాణాలే 50 వేలకుపైగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారులు మారడం కొంత పర్యవేక్షణ తగ్గినా ఆ తర్వాతైనా ప్రగతి కనిపించడం లేదు. గృహ నిర్మాణ శాఖ పీడీగా గతంలో అఖిల వ్యవహరించారు. ఆమెకు బదిలీ అవ్వడంతో పూర్తిస్థాయి అధికారిని నియమించాల్సి ఉంది. ఈఈ శ్రీనివాసరావు ఇన్‌ఛార్జి పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పూర్తిస్థాయి సిబ్బంది కొరత వేధిస్తుంది.



వంద రోజుల ప్రణాళికలోనూ..

కూటమి ప్రభుత్వం వచ్చాక వంద రోజుల ప్రణాళికలో గృహ నిర్మాణ శాఖలో చేపట్టిన పనులు తూతూమంత్రంగా ఉన్నాయి. మొత్తం ఇళ్లలో 9 వేల ఇళ్లకు పైకప్పు పనులు పూర్తిచేయించేలా లక్ష్యం విధించారు. అమలులో మాత్రం 81 ఇళ్లనే పూర్తి చేశారంటే ఎంత ఘోరంగా చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

23న ఏయూ పాలకవర్గ సమావేశం!

ఈనాడు, విశాఖపట్నం

ఆంధ్ర విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి (ఈసీ) లేదా పాలకవర్గ సమావేశం ఈనెల 23న నిర్వహించే అవకాశముంది. దీనికి సంబంధించిన అజెండాను ఏయూ అధికారులు ఇప్పటికే ఉన్నత విద్యాశాఖకు పంపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈసీ సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి.

ఇందులో విద్యా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు తదితరాలపై చర్చించనున్నారు. సమావేశానికి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వర్చువల్‌గా హాజరయ్యే అవకాశముంది.

పలు కీలక నిర్ణయాల అమలుపై చర్చ

ప్రస్తుత ఈసీకి ఇదే చివరి భేటీ..!



త్వరలో ఈసీ రద్దు..

ప్రస్తుతం ఏయూలో గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గమే కొనసాగుతోంది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పాలకవర్గాలను రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతోంది. వాటి స్థానంలో బోర్డు ఆఫ్ గవర్నన్స్ (గవర్నింగ్ బాడీ)ని నియమించడంపై సమాలోచనలు జరుగుతున్నాయి. గవర్నింగ్ బాడీ ఏర్పాటయ్యేందుకు కనీసం ఆరు నెలలు పడుతుందని విద్యావేత్తలు చెబుతున్నారు. ఈలోగా ప్రస్తుత ఈసీని రద్దు చేసి.. కొత్త పాలకవర్గాన్ని నియమించే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే ప్రస్తుత పాలకవర్గానికి ఇదే చివరి సమావేశం కావచ్చు.



ఈసీలో చర్చకు వచ్చే అవకాశమున్న కొన్ని అంశాలు..

1 **నామినీ ఎంపిక ప్రధానం:** వీసీ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీలో యూజీసీ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున నామినీలను ఎంపిక చేశారు. వర్సిటీ తరఫున ఈసీ నామినీ పేరును ఈనెల 25లోపు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈసీ సమావేశంలో ప్రధానంగా దీనిపై చర్చించనున్నారు.

2 **ప్రొఫెసర్ల నియామకానికి..:** మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఇంజినీరింగ్‌లో ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ విభాగాల్లో అధ్యాపకుల కొరత ఎక్కువగా ఉంది. ఆయా విభాగాల్లో నిబంధనలకు అనుగుణంగా తాత్కాలిక ప్రాతిపదికన ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీసు (పీఓపీ), అడ్జంక్ట్ ప్రొఫెసర్లను నియమించేందుకు అనుమతులు తీసుకోనున్నారు.

3 **కంప్యూటరీకరణకు..:** 'సమర్థ్' ప్రాజెక్టులో భాగంగా వర్సిటీలో అన్ని కార్యకలాపాలను డిజిటలైజ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఉద్యోగుల సర్వీసు, ఉద్యోగులు, విద్యార్థుల హాజరు, పరీక్షలు, పరీక్షా పత్రాల మూల్యాంకనం, ఫీజులు తదితర వివరాలను కంప్యూటరీకరణ (డిజిటలైజేషన్) చేయనున్నారు. ఈ ప్రాజెక్టును అమలుచేయడానికి తీర్మానం చేయనున్నారు.

4 **ప్రయోగశాలల ఏర్పాటుకు:** ఎలిమెంట్ భవనంలో ఫార్మా, ఆహార పరీక్షల ప్రయోగశాలలు, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. వీలుగా ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకోనున్నారు. దీనికి అవసరమైన యంత్ర సామగ్రిని ఇప్పటికే తెప్పించారు. వాటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు

5 **రెండు డిగ్రీల విధానంపై..:** వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లోనూ రెండు డిగ్రీల విధానం తీసుకురానున్నారు. కొత్తగా వీఎల్ఎస్ఐ కోర్సును ప్రారంభించనున్నారు. వాటి అమలు, అవసరమైన పాఠ్యప్రణాళిక రూపొందించేందుకు అనుమతులు తీసుకోనున్నారు.

6 **కంప్యూటర్ల కొనుగోలుకు..:** విద్యార్థుల అవసరాల నిమిత్తం 500 'థిన్ క్లైంట్ సర్వర్ బేస్డ్' కంప్యూటర్లను కొనుగోలు చేయనున్నారు. దీనిపై ఈ-టెండర్‌కు వెళ్లనున్నారు. దీని ద్వారా ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు వీలవుతుంది. ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల విద్యార్థులకు ప్రాంగణ నియామకాల సమయంలో, కంప్యూటర్, ఇతర ప్రాజెక్టులు చేయడానికి ఉపయోగపడుతుంది. అవసరమైతే ప్రభుత్వ నియామకాలకు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలకు కూడా వినియోగించుకోవచ్చు. దీనిపై సమావేశంలో చర్చించనున్నారు.

దారికాసిన ప్రమాదాలు



దొంకాడ వద్ద విరిగిన దీపపు స్తంభాన్ని వైర్లతో కట్టారిలా..



లంకెలపాలెం వద్ద విరిగిన ఇనుప గ్రిల్స్

అనకాపల్లి-విశాఖ జాతీయ రహదారిలో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరిగింది. ఈ ఘటనలను పరిశీలిస్తుంటే మానవ తప్పిదాలు, రహదారి నిర్వహణ లోపాలు, వాహనదారుల నిర్లక్ష్యం వంటివి కనిపిస్తున్నాయి.



అగనంపూడి సమీపంలో డివైడర్‌ను దాటుతున్న వాహన చోదకుడు

అగనంపూడి సమీపంలో జాతీయ రహదారిలో దొంకాడ వద్ద విరిగి ప్రమాద భరితంగా ఉన్న దీపపు స్తంభాన్ని అలానే వదిలేశారు. దీన్ని వైర్ల సాయంతో కట్టారు. అయితే ఇది తాత్కాలికమే. లంకెలపాలెం వద్ద విరిగిన ఇనుప గ్రిల్సు ప్రమాదభరితంగా ఉన్నాయి. అగనంపూడి సమీపంలో రద్దీగా ఉండే దారిలో డివైడర్‌ను ద్విచక్ర వాహనదారులు ప్రమాద భరిత స్థితిలో దాటేస్తున్నారు. రహదారి భద్రత విషయంలో ఎప్పటికప్పుడు అందరూ అప్రమత్తంగా ఉండాల్సిందే. – ఈనాడు, విశాఖపట్నం

అధ్యయన యాత్రకు నేడు కార్పొరేటర్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ కార్పొరేటర్లు సోమవారం అధ్యయన యాత్రకు బయలుదేరి వెళ్లనున్నారు. 85 మంది కార్పొరేటర్లు యాత్రకు సుముఖత తెలపగా, అధికారులు, సిబ్బందితో కలిసి మొత్తం 118 మంది ఉదయం 10 గంటలకు ఇక్కడి నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరు చేరుకోనున్నారు. మైసూరు, ఊటీల్లో పర్యటించి అక్కడ చేపడుతున్న ఆకర్షణీయ ప్రాజెక్టులు, ఘనవ్యర్థాల నిర్వహణను పరిశీలించనున్నారు. 27న తిరిగి నగరానికి చేరుకోనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు రాజీలేని పోరాటం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆధీనంలో విద్యా సంస్థలు ఉంటేనే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులను నిలబెట్టుకోగలమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్.నాగమణి ఆవిష్కరించారు. అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. పాలకవర్గాల విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీన పడిందన్నారు. ఈ వ్యవస్థను బతికించుకోవడానికి బడి సమయం కంటే అదనంగా ఒక గంట ఉపాధ్యాయులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహన్‌రావు, ఎస్.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్, నాయకులు పైడిరాజు, ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు చుక్క సత్యం, ఉప్పాడ రాము, మహ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు

హిమం.. మురిపెం!

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే: మన్యంలో మంచు సోయగాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా గత మూడు రోజుల నుంచి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తోంది. మధ్యాహ్నం ఎండ కాస్తూ, చిరుజల్లులు కురుస్తున్నాయి. పాడేరు శివారులోని పచ్చని కొండల నడుమ మంచు అందాలు ఆకట్టుకుంటున్నాయి. పాడేరు ఘాట్‌రోడ్డులో పొగమంచు కమ్ముకుని రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంజంగి మేఘాలకొండకు పర్యటకులు తరలివచ్చారు.

● పర్యటకుల రాకతో చింతపల్లి మండలంలోని లంబసింగి, చెరువులవెనం, తాజంగి, ఎర్రవరం జలపాతాల వద్ద సందడి నెలకొంది. శని, ఆదివారాల్లో ఇక్కడ మంచు అందాలను ఆస్వాదించేందుకు దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కుటుంబాలతో సహా తరలివచ్చారు. ముసురు వాతావరణంతో గత మూడు రోజులుగా అరకులోయ పరిసరాల్లో మంచు ప్రభావం తగ్గింది. ఆదివారం పొగమంచు కనిపించింది. మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్‌కు తెల్లవారుజాము నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు చేరుకున్నారు. మేఘాల నడుమ సూర్యోదయాన్ని తిలకించారు. ఈ అందాలను కెమెరాల్లో బంధించారు. థింసా నృత్యాలతో సందడి చేశారు.

మన్యంలో మరో మేఘాలకొండ



మన్యంలో మరో మేఘాల కొండ చూపరులను కనువిందు చేస్తోంది. డుంబ్రిగుడ మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రానికి సమీపంలోని జైపూర్ కూడలి మీదుగా అటవీ ప్రాంతంలో కృష్ణుడి గుడి కొండల్లో నీలి మేఘాల నడుమ పాలసంద్రంలా మంచు పరచుకుని ఆహ్లాదం పంచుతోంది. అరుకు పంచాయతీ కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఈ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. –న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

అంగన్‌వాడీలపై 'ఫేస్ యాప్' భారం

సహకరించని ఫోన్లు, లబ్ధిదారులు

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించే అంగన్‌వాడీలపై ఫేస్‌యాప్ రూపంలో మరో పని భారం పడింది.

ఇప్పటికే బాలసంజీవిని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపు ద్వారా రేషన్ ఇస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ యాప్‌లో కూడా లబ్ధిదారుల ముఖ గుర్తింపు తప్పనిసరి చేస్తూ మరోమారు లబ్ధిదారుల వివరాల నమోదును ప్రారంభించారు. దీంతో రెండు యాప్‌లలో లబ్ధిదారుల ముఖ గుర్తింపు నమోదు కష్టతరంగా మారింది. నమోదు విషయంలో కనీసం ఐసీడీఎస్ సిబ్బందికి కూడా సరైన శిక్షణ లేకపోవటంతో అంతా గందరగోళంగా మారింది.

07-3 సంవత్సరాల బాలలకు తప్పనిసరి...: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు, 07-3 సంవత్సరాల బాలలకు ప్రతీ నెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో కేంద్రం వద్ద వండి ఇచ్చేవారు. ఎక్కువ మందికి టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) కావాలంటూ అభ్యర్థనలు రావటంతో పాలు, గుడ్లు, నూనె, పప్పు, బియ్యం వంటివి లబ్ధిదారులకు ప్రతీనెలా రెండు దఫాలుగా ఇస్తున్నారు.

● టీహెచ్‌ఆర్ పంపిణీలో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్(ముఖచిత్ర యాప్)ను ప్రవేశపెట్టింది. లబ్ధిదారులు వచ్చిన సమయంలో వారి ముఖచిత్రం ద్వారా గుర్తించి, యాప్‌లో నమోదు చేసి టీహెచ్‌ఆర్ అందించేవారు.



ముఖచిత్రం యాప్‌లో లబ్ధిదారుల ఫొటోను తీస్తున్న దృశ్యం

● గర్భిణులు, బాలింతలు, 07-3 సంవత్సరాల వయసు గల చిన్నారుల పూర్తి వివరాలను మరోసారి పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలంటూ ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ యాప్‌లో కూడా లబ్ధిదారుల ముఖచిత్రాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తోంది. ఒకే వ్యక్తి వివరాలను రెండు యాప్‌లలో నమోదు చేయటం, టీహెచ్‌ఆర్ పంపిణీ సమయంలో ఒకే వ్యక్తికి రెండుసార్లు ఫేస్‌యాప్ గుర్తించటం అనేది ఇబ్బందికరంగా మారింది. ఇందుకు ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు అనుకూలంగా లేవని తెలుస్తోంది.

● సాధారణంగా టీహెచ్‌ఆర్ కోసం 07-3 సంవత్సరాల వయసు గల పిల్లలు కేంద్రానికి రారు. వారి తల్లిదండ్రులుగానీ, ఇంట్లో పెద్దలుగానీ వస్తారు. ప్రస్తుతం పిల్లలకు కూడా రెండు సార్లు ముఖచిత్రం ద్వారా టీహెచ్‌ఆర్ పంపిణీకి చాలా సమయం పడుతోంది. ఒక్కో కేంద్రం పరిధిలో 20 నుంచి 25 మంది వరకు గర్భిణులు, బాలింతలు ఉంటే, 07-3 సంవత్సరాల పిల్లలు 75 నుంచి 150 వరకు ఉంటారు. వీరందరికి వివరాలను యాప్‌లో నమోదు చేసి ఇవ్వటానికే చాలా సమయం పడుతోంది. అందులోను నెలలో రెండుసార్లు ఈ విధంగా చేయటం అనేది సాధ్యం కాదని, దీనివల్ల పూర్వ ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బతినే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● నిర్ణీత సమయంలో యాప్‌లలో వివరాలను నమోదు చేయాలంటూ యంత్రాంగం ఒత్తిడి తీసుకువస్తుంటే పోషణ ట్రాకర్ పూర్తిస్థాయిలో పనిచేయని పరిస్థితి నెలకుంది. కనీసం ఈ విధానంపై సరైన శిక్షణ కూడా ఇవ్వలేదు. ఫేస్‌యాప్‌లో నమోదు చేసే సమయంలో లబ్ధిదారుల ఫోన్‌కు ఓటీపీ వెళ్తుంది. దీన్ని చెప్పటానికి చాలామంది సందేహిస్తున్నారు. దీంతో నమోదు మరింత ఆలస్యమవుతోంది.

విశాఖ-రాయ్‌పూర్ పాసింజర్ సమయాల్లో మార్పు

రైల్వేస్టేషన్: విశాఖ-రాయ్‌పూర్ (08528) పాసింజర్ సమయాల్లో మార్పు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ రైలు తెల్లవారుజామున 4.25 గంటలకు విశాఖ నుంచి బయల్దేరి, రాత్రి 7.45 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుందన్నారు. గతంలో ఈ రైలు ఉదయం 6.30 గంటలకు బయల్దేరేదని పేర్కొన్నారు.



లారీ ఢీకొని మహిళ దుర్మరణం

గురుద్వారా: లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందినట్లు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. కంచరపాలెం బర్మాక్యాంపు ప్రాంతానికి చెందిన ఈశ్వరరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. భార్య సంతోషి (36)తో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం ఓ శుభకార్యం నిమిత్తం మధురవాడ వెళ్తుండగా జాతీయ రహదారిపై శాంతిపురం కూడలి వద్ద వెనుక నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొని భార్యాభర్తలిద్దరూ తుళ్లిపోయి చెరోవైపు పడిపోగా భార్య తల పైనుంచి లారీ చక్రాలు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నాలుగో పట్టణ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి లారీ డ్రైవర్ అప్పలరాజును అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనతో రహదారిపై స్తంభించిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

తీరంలో సందడి..








రాళ్లపై సందడి చేస్తున్న సందర్శకులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : బీచ్‌రోడ్డులో ఆదివారం ఎక్కడ చూసినా కోలాహలమే కనిపించింది. ఆర్.కె.బీచ్ నుంచి వుడా పార్కు వరకు రద్దీ నెలకొంది. సముద్ర తీరంలో సందర్శకులు సందడి చేశారు. తీరంలోని రాళ్లపైకి ఎక్కి సెల్ఫీలు దిగుతూ కనిపించారు. పిల్లలు, పెద్దలు సముద్ర స్నానాలు చేస్తూ అలల్లో ఆడుకున్నారు.

'విశాఖ డెయిరీలో ఉద్యోగులపై వివక్ష'



విశాఖ డెయిరీ ఉద్యోగుల జీతాలను చూపుతున్న పీతల మూర్తియాదవ్

సీతంపేట, న్యూస్‌టుడే : విశాఖ డెయిరీ యాజమాన్యం ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ విమర్శించారు. దివంగత తులసీరావు ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగుల పిల్లల పేరిట చేసిన డిపాజిట్ మొత్తం సుమారు రూ.25కోట్లు ప్రస్తుత ఛైర్మన్ ఆడారి ఆనంద్ కాజేశారని ఆరోపించారు. విశాఖ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఛైర్మన్ బంధువైన ఉద్యోగినికి రూ.లక్ష వేతనం చెల్లిస్తున్నారని, అంతేకాకుండా ఒకేసారి రూ.30వేలు పెంచారన్నారు. ఆమె కంటే పెద్ద చదువులు చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారికి రూ.30వేలకు మించి ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో తాను చేసిన ఖర్చు మొత్తం సర్దుబాటు చేసేందుకు సుమారు రూ.30 కోట్ల మేర లెక్కల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఛైర్మన్ భార్య పేరిట డెయిరీ నడుపుతూ నిత్యం విశాఖ నుంచి 25వేల లీటర్ల పాలను అక్కడికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఛైర్మన్ ఇంటికి నెలకు రూ.2లక్షల అద్దె డెయిరీ చెల్లిస్తోందన్నారు. విశాఖ డెయిరీలో ఛైర్మన్ కుటుంబం దోపిడీని ఆధారాల సహా ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కి అందించానని, త్వరితగతిన విచారణ జరిపి డెయిరీని కాపాడాలని కోరినట్లు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో సినీనటి

సింహాచలం, న్యూస్‌టుడే: తెలుగు సినీనటి లయ ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆమెను ఆశీర్వదించారు. అధికారులు స్వామి వారి ప్రసాదం అందజేశారు.



ఆలయ ప్రాంగణంలో సినీనటి లయ, తదితరులు

విరిగి వేలాడుతున్నాయి..



విశాఖ ద్వారకా బస్‌స్టాండు ట్రాఫిక్ సిగ్నల్ కూడలి వద్ద వేసవిలో ఏర్పాటు చేసిన హరిత పందిరి సామగ్రి ఊడిపోతోంది. ఎండల బారినుంచి వాహనదారులకు నీడనిచ్చేందుకు గతంలో వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు దానికి ఉన్న పచ్చని వస్త్రం పూర్తిగా పోయింది. ఇప్పుడు చల్లని తుంపర్లను వెదజల్లే పైపులు ఊడి వేలాడుతున్నాయి. –ఈనాడు, విశాఖపట్నం

పట్టు జారితే పుటుక్కే..



అనకాపల్లి - విశాఖ జాతీయ రహదారిలో అగనంపూడి వద్ద ఆటోలో తరలిస్తున్న పుల్లలపై మహిళలు కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఆటో వేగంగా వెళ్లే సమయంలో పుల్లలు జారితే పుటుక్కే మరి. –ఈనాడు, విశాఖపట్నం.

చిన్నారి ప్రతిభ

5 నెలలకే 120 ఫ్లాష్ కార్డుల గుర్తింపు



మంత్రి సంధ్యారాణితో చిన్నారి, తల్లిదండ్రులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన సిరికి లక్ష్మునాయుడు, హారిక దంపతుల ఐదునెలల కుమార్తె ధన్విక 'నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్'ను సొంతం చేసుకుంది. అతి చిన్న వయసులోనే 120 ఫ్లాష్ కార్డులు గుర్తించి చిచ్చరపిడుగు అనిపించుకుంది. తల్లిదండ్రులు విశాఖలోని ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారు. ఖాళీ సమయంలో పాపకు జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లు, రంగులు, వివిధ దేశాల జెండాల కార్డులు చూపించి గుర్తు పట్టేలా శిక్షణ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియోలను తీసి నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు ఆన్‌లైన్‌లో మెయిల్ ద్వారా పంపించారు. వాటిని పరిశీలించి ప్రశంసా పత్రం, పతకాన్ని కొరియర్ ద్వారా అందించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం చిన్నారి తల్లిదండ్రులను సాలూరులో అభినందించారు.

ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ ఆఫీస్ సబార్డినేట్స్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఏడు పదవులకు ఏడు నామినేషన్లు రాగా ఏడుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆర్.రామచంద్రప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా వి.నాగయ్య (ద్వారకా సర్కిల్), ఉపాధ్యక్షుడిగా-1 వరహాలబాబు (స్టీల్‌ప్లాంట్ సర్కిల్), ఉపాధ్యక్షుడు-2గా ఎస్.బేగం (కురుపాం మార్కెట్ సర్కిల్), ప్రధాన కార్యదర్శిగా ఏటీ వెంకటేశ్వర్లు (జేసీ కార్యాలయం, విశాఖపట్నం), కార్యాలయం కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు (చినవాల్తేరు సర్కిల్), సంయుక్త కార్యదర్శిగా ఎస్.సింహాచలంనాయుడు (అనకాపల్లి సర్కిల్), కోశాధికారిగా పి.రామారావు (డాబాగార్డెన్స్) ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జనసేన అధినేత, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 9.30గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ఇక్కడి నుంచి 9.35 గంటలకు రోడ్డు మార్గంలో విజయనగరం జిల్లా గుర్ల గ్రామానికి బయలుదేరి వెళతారు. అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి సాయంత్రం 4.10గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడి నుంచి 4.15గంటల విమానంలో విజయవాడ బయలుదేరి వెళతారు.

బాల్య వివాహం చేస్తే కఠిన చర్యలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: బాల్య వివాహం చేయడం నేరమని ఆశ్రయ నిర్వాహకుడు ప్రగడ వాసు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు సమీపంలోని పాచిపెంట మోసూరు గ్రామానికి చెందిన బాలిక(14)కు తల్లిదండ్రులు వివాహం చేయబోగా తప్పించుకుని విశాఖ చేరుకుంది. ఆశ్రయ కేంద్రం నిర్వాహకులు ఆమెను గుర్తించి రైల్వే పోలీసుల సహకారంతో టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఆశ్రయం కేంద్రానికి తరలించారు. అనంతరం వివరాలు తెలుసుకుని బాలిక తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ఆదివారం వారు నగరానికి చేరుకోగా తల్లి, మేనమామకు బాలికను అప్పగించారు. బాల్య వివాహం చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.



నూతన కమిటీ సభ్యులతో ఏపీ ఐకాస అమరావతి ప్రతినిధులు

ఏపీ ఐకాస అమరావతి మహిళా కమిటీ ఎన్నిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ఐకాస అమరావతి సంఘం విశాఖ జిల్లా మహిళా కమిటీని ఎన్నుకున్నారు. శనివారం రాత్రి రెవెన్యూ భవన్ సమావేశ మందిరంలో ఏపీ ఐకాస విశాఖ ఛైర్‌పర్సన్ శైలజ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మహిళా విభాగం ఛైర్‌పర్సన్ పారె లక్ష్మి, సహ ఛైర్‌పర్సన్ విద్య ఆధ్వర్యంలో నూతన సభ్యులను ఎంపిక చేశారు. విశాఖ డివిజన్ ఛైర్‌పర్సన్‌గా రెవెన్యూ విభాగానికి చెందిన బి.శ్రీలత, సహ ఛైర్‌పర్సన్‌గా ఆర్టీసీ నుంచి జి.కుమారి, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి రమ్య అనూష, కోశాధికారిగా సివిల్ డిఫెన్స్ నుంచి ఇ.ప్రసన్న, సహ ఛైర్‌పర్సన్‌గా కో-ఆపరేటివ్ శాఖ నుంచి డి.రమణమ్మ, రెవెన్యూ నుంచి కె.రేణుకాదేవి, ఆప్కోస్ నుంచి సీహెచ్ స్వాతిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా ఛైర్‌పర్సన్ నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపఛైర్మన్ డీజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో ఫ్లై ఓవర్ రెయిలింగ్ పైకి ఎక్కిన కారు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద పై వంతెనపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. చిల్లకల్లు ఎస్సై సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని బిళ్లపాడుకు చెందిన నిల్లా వెంకట నాగ మల్లికార్జునరావు, భార్య నిల్లా నాగలక్ష్మి, కుమారులు నిల్లా శ్రీకాంత్, చైతన్య ఫణికాంత్ రెండేళ్లుగా హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో నివసిస్తున్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి విశాఖపట్నంలోని బంధువుల ఇంటికి కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ఆదివారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హైదరాబాద్ ప్రయాణమయ్యారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద జాతీయ రహదారిపై వారు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వచ్చిన మరో కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో నాగలక్ష్మి(56), పెద్దకుమారుడు శ్రీకాంత్(32) అక్కడికక్కడే మృతి చెందారు. చిన్న కుమారుడు చైతన్య ఫణికాంత్, వెంకట నాగ మల్లికార్జునరావులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీకాంత్ అందులోనే ఇరుక్కుపోయారు. ఆయన్ను బయటకు తీయడానికి పోలీసులు, స్థానికులు తీవ్రంగా శ్రమించారు. కారులో వెనుక సీటులో కూర్చున్న తల్లి కూడా మృతి చెందింది. ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీకొట్టడంతో వీరి కారు ఫ్లైఓవర్‌పై రెయిలింగ్‌పైకి ఎక్కిందంటే ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఎదురుగా వచ్చిన కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో వారు సురక్షితంగా బయటపడ్డారు.



వందనం స్వీకరిస్తున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

పోలీసు అమరవీరుల స్మృతి సన్నాహక పరేడ్

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఈనెల 21న పోలీసుశాఖ ఆధ్వర్యంలో జరిగే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో సన్నాహక పరేడ్ నిర్వహించారు. ఆదివారం ఉదయం జరిగిన సన్నాహకాలను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం విజయవంతంగా నిర్వహించటానికి అవసరమైన పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలీసు అధికారులు



పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు

జాతీయ స్కేటింగ్ పోటీలకు విశాఖ క్రీడాకారులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ స్కేటింగ్ పోటీలకు విశాఖ క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి దేముడు తెలిపారు. పోటీలు డిసెంబరు రెండో వారంలో దిల్లీలో జరుగుతాయన్నారు. అండర్-11 బాలుర విభాగంలో జయచంద్రన్, బాలికల విభాగంలో షేక్ అమీనా, డి.ప్రియ, సిహెచ్.ఛార్వీ, అండర్-17 బాలుర విభాగంలో పి.జాన్సన్, లోహిత్‌సాయి, బి.శశాంక్, బాలికల విభాగంలో విద్యా ప్రజాపతి, శ్రీకీర్తి ఐశ్వర్య ఎంపికయ్యారన్నారు. వీరంతా ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

రాజీలేని విప్లవ యోధుడు గద్దర్

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : విప్లవ ఉద్యమంలో రాజీలేని పోరాటం చేసిన గద్దర్‌ను అభ్యుదయ వాదులు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం టి.ఎల్.ఎన్. సభాహాలులో బహుజన కళామండలి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'ప్రజా యుద్ధ నౌక గద్దర్ యాదిలో' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గద్దర్ పాటల శైలి జన బాహుళ్యానికి ఎంతో చేరువైందన్నారు. జీవితమంతా సమాజ హితాన్ని కోరుకున్న గద్దర్‌ను ఆదర్శంగా తీసుకొని అనేక మంది అభినవ గద్దర్‌లు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య జాన్, ఆచార్య ప్రేమానందం, ఆచార్య ఎన్.విజయమోహన్, గద్దర్ కుమార్తె వెన్నెల, ఆచార్య టి.షారోన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

గాయకులకు మంచి భవిష్యత్తు ఉంది

దర్శకుడు పి.సి.ఆదిత్య

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : వైజాగ్ బీట్స్ వార్షికోత్సవం గాదిరాజు ప్యాలెస్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మెగా సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సినీ దర్శకుడు పి.సి.ఆదిత్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ బీట్స్‌కు చెందిన గాయకులు అద్భుతంగా పాడుతున్నారని.. వారికి మంచి భవిష్యత్తు ఉందన్నారు. డిజైర్ సొసైటీ(హెచ్ఐవీ బాధిత బాలల సంరక్షణ సంస్థ)కు వైజాగ్ బీట్స్ తరపున రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో గజల్స్ శ్రీనివాస్ హాజరయ్యారు. అనంతరం అతిథులను సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకురాలు శారదా, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గజల్స్ శ్రీనివాస్



సినీ దర్శకుడు ఆదిత్యను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

పెందుర్తి

తెరపై ఈనాడు పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ ఫ్లెక్స్-1 - దేవర
ఫ్లెక్స్-2 - విశ్వం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి-2 11కేవీ ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ప్రగతి కేంద్రం, వెలంపేట, చిన్నముషిడివాడ ఏరియా, ప్రగతినగర్, జ్యోతి కాలా ఏరియా, సుజాతనగర్ డిమార్ట్ ప్రాంతం, సాయి జనం, పెందుర్తి పాత గ్రామం, ఎల్‌ఐసీ కాలనీ, పశువుల ఆసుపత్రి ఏరియా, పెందుర్తి కూడలి, రాతిచెరువు ఏరియా, తమిళ నాడు మార్కెట్, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, పరవాడ

సమస్య: మేజర్ పంచాయతీ పరవాడలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. శునకాలు వీధుల్లో గుంపులుగా తిరగడంతో పిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులను ఇవి వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

– అప్పలనాయుడు, పరవాడ

సమాధానం: మీ ప్రాంతంలో వీధి కుక్కల నియంత్రణకు త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

– న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: సబ్బవరం మండల కేంద్రం చింతలగెడ్డలో రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇటీవల పడుతున్న వర్షాలకు వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోంది. దీనివల్ల దోమలు పెరిగి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వెంటనే చెత్తను తొలగించాలి.

– దుర్గాప్రసాద్, సబ్బవరం

సమాధానం: పరిశీలించి త్వరలో వ్యర్థాలను తొలగించే ఏర్పాటు చేస్తాం.

– డి.ప్రసాదరావు, సర్పంచి సబ్బవరం

పేదింట బిల్లుల భాగ్యం

ఎన్టీఆర్ గృహ నిర్మాణాల సొమ్ముల చెల్లింపునకు కూటమి ప్రభుత్వం నిర్ణయం



వెన్నెలపాలెంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా నిర్మించుకున్న ఇళ్లు

పరవాడ, న్యూస్‌టుడే

గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న పేదల ఇళ్లకు వైకాపా ప్రభుత్వం బిల్లులు నిలిపేసింది. లబ్ధిదారులకు గత ఐదేళ్లలో ఎటువంటి చెల్లింపులు చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయగా మరికొందరు ఆర్థిక స్తోమత లేక వివిధ దశల్లో ఇంటి నిర్మాణాలను నిలిపివేశారు. వైకాపా హయాంలో బిల్లుల కోసం 5 ఏళ్లపాటు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. గృహ నిర్మాణ శాఖ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లను నిర్మించుకున్న వారికి పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పెందుర్తి నియోజకవర్గానికి 2653 ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు రూ.2.లక్షల చొప్పున నిర్ణయించారు.

క్షేత్ర స్థాయి సర్వే ద్వారా గుర్తింపు..

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు నిర్మాణాలను ఎంతవరకు పూర్తి చేశారనే విషయమై సర్వే చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి సర్వే ప్రారంభించారు. గృహ నిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది, కూటమి నేతలు ఇంటింటికి తిరిగి ఎన్టీఆర్ హౌసింగ్ జియో ట్యాగ్ వెరిఫికేషన్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటి నిర్మాణం ఎంతవరకు పూర్తయింది, ఏ దశలో ఉంది అనే వివరాలతో పాటు లబ్ధిదారుని ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. త్వరలోనే బిల్లులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

మండలం	మంజూరైన గృహాలు	సర్వే చేసిన గృహాలు
పరవాడ	900	748
సబ్బవరం	1148	688
పెందుర్తి	605	452
మొత్తం	2653	1888



చాలా సంతోషంగా ఉంది..

తెదేపా హయాంలో ఎన్టీఆర్ హౌసింగ్‌లో భాగంగా సొంతింటి కలను నెరవేర్చుకున్నాం. గతంలో రూ.77,500 వరకు బిల్లులు వచ్చాయి. 2019లో ప్రభుత్వం మారడంతో మిగతా బిల్లులు రాలేదు. అధికారులను పెండింగ్ బిల్లుల గురించి అడిగినా ప్రయోజనం లేకపోయింది. 5 ఏళ్లుగా ఎదురుచూసినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అప్పటి బిల్లులు చెల్లించేందుకు సర్వే చేపట్టడంతో ఇబ్బందులు తీరనున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– రావాడ ఈశ్వరమ్మ, వెన్నెలపాలెం



ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2014-19 వరకు ఎన్టీఆర్ (గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లు నిర్మించుకుని బిల్లులు రాని లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయి సర్వే ద్వారా గుర్తించాం. ఎంత మేర బిల్లులు చెల్లించారు, ఇంకా ఎంత చెల్లించాలి అనే వివరాలను లబ్ధిదారులతో మాట్లాడి సమాచారాన్ని సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేశాం. నివేదిక ప్రభుత్వానికి పంపుతాం. సర్వే ఆధారంగా త్వరలోనే బిల్లులు చెల్లింపులు ప్రభుత్వం చేపట్టనుంది.

– ఈ.రామచంద్రరావు, ఏఈ, పరవాడ మండల గృహనిర్మాణ శాఖ



పరవాడలో సర్వే చేస్తున్న హౌసింగ్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ దేముడుకి రహదారిపై గోతులను చూపిస్తున్న కాలనీవాసులు

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: గోతులతో అధ్వానంగా మారిన పురుషోత్తపురం - హెచ్‌బీ కాలనీ రోడ్డును బాగు చేయించాలని కాలనీవాసులు 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడిని కోరారు. కాలనీవాసుల విన్నపం మేరకు కార్పొరేటర్ ఆదివారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు ప్రాంతాల్లో రోడ్డు గోతులపడిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రహదారిపై రాళ్లుతేలి ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ప్రజలకు హామీ ఇచ్చారు. కంఫర్ట్ హోమ్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జోగారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ చొరవతో సైకిల్ షెడ్ల నిర్మాణం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింహాద్రి ఎన్టీపీసీ చొరవతో సైకిల్ షెడ్లు నిర్మించారు. ఇక్కడి విద్యాలయాలకు పరిసర గ్రామాలకు చెందిన ఎక్కువమంది విద్యార్థులు సైకిళ్లపై వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. షెడ్లు లేకపోవడంతో సైకిళ్లకు ఎండ, వాన నుంచి రక్షణ లేకుండా పోయింది. వానలకు సైకిళ్లు తడవడంతో తుప్పుపట్టి తొందరగా పాడవుతున్నాయి. విద్యార్థుల సమస్యను ఉపాధ్యాయులు ఎన్టీపీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సంస్థ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.11 లక్షలు మంజూరు చేయడంతో షెడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పరవాడ జెడ్పీ బాలికల పాఠశాలలో షెడ్ నిర్మాణం పూర్తి కాగా జూనియర్ కళాశాలలో పనులు చివరిదశకు చేరుకున్నాయి.



పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మించిన సైకిల్ షెడ్

పునాదులు దాటని సామాజిక భవనం



పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన కాపు సామాజిక భవనం

కాపు సామాజిక భవనం(కల్యాణ మండపం) నిర్మించేందుకు ఎప్పుడో ఆరేళ్ల క్రితం వేసిన పునాదులు నేటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. సామాజిక భవన నిర్మాణం కల కలగానే మిగిలిపోతోందని ఆ సామాజిక వర్గం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్బవరం మండలం ఇరువాడలో 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పునాదులు పూర్తి చేసే సమయానికి ప్రభుత్వం మారడంతో నిధులు గుత్తేదారుకు అందలేదు. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీనివంక కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం పిల్లర్ల కోసం వినియోగించిన ఇనుప చువ్వలు తుప్పుపట్టిపోయాయి. పునాదుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని భవన నిర్మాణాన్ని పూర్తి కాపు సామాజిక వర్గం నేతలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సబ్బవరం

అ వీ ఇ వీ

ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం పెందుర్తి యూనిట్ అధ్యక్షుడు అల్లం కృష్ణారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతినెలా పింఛను 5వ తేదీలోగా ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక పరమైన సమస్యలు ఒక్కటి కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. మంత్రివర్గ సమావేశం జరిగిన ప్రతిసారీ సమస్యలు పరిష్కారమవుతాయని పింఛనుదారులు ఎదురుచూడటం తప్పడం లేదన్నారు. దీపావళిలోగా బకాయిలను విడుదల చేయాలని కోరారు. 12వ పీఆర్‌సీ కమిటీని నియమించి ఐఆర్‌ను చెల్లించాలన్నారు.

పీఠానికిచ్చిన భూములు వెనక్కి తీసుకోవడం హర్షణీయం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం శారదా పీఠానికి ఇచ్చిన 15 ఎకరాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం హర్షణీయమని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతం ముసుగులో అక్రమాలకు పాల్పడిన శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి కూటమి ప్రభుత్వం బుద్ధి చెప్పిందన్నారు. కార్యక్రమంలో జిల్లా తెదేపా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, నాయకులు దువ్వి పరమేశ్వరరావు, కె.నరేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బార్, పబ్‌లలో తనిఖీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో శనివారం రాత్రి పోలీసులు నగరంలోని పబ్, బార్‌లను తనిఖీ చేశారు. ఎక్సైజ్ శాఖ జారీచేసిన లైసెన్స్, ఫుడ్ లైసెన్స్, అగ్నిమాపకదళ అధికారులు జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రం, పార్కింగ్, ట్రేడ్ లైసెన్స్ వంటి వాటిని పరిశీలించేందుకు తనిఖీలు జరిపారు. ఆయా బార్, పబ్‌లలో సీసీ కెమెరాలున్నవి.. లేనివి పరిశీలించారు. ఒక పబ్ వద్ద పార్కింగ్ లేదని గుర్తించారు. నిబంధనలకు పాటించని వారికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో ప్రజలు 7995095799 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

అనంతుడి పవిత్రోత్సవాలు


పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో అనంతుడి పవిత్రోత్సవాలు ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి తెలిపారు. 27వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమై, 28న అగ్ని మథనం, 29న పంచామృతాభిషేకం, స్వామివారికి పవిత్రాల సమర్పణ, 30న పవిత్రాల విసర్జన, పూర్ణాహుతి, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అవయవదాతల సంఘం సమన్వయకర్తగా దాడి శ్రీను

పెందుర్తి, న్యూస్‌టుడే: ఏపీ శరీర అవయవదాతల సంఘం పెందుర్తి జోన్ సమన్వయకర్తగా స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను నియమితులయ్యారు. ఆ మేరకు సావిత్రీబాయి పులే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి ఆదివారం నియామక పత్రం అందించినట్లు శ్రీను తెలిపారు. పెందుర్తి ప్రాంతంలో అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు శ్రీను పేర్కొన్నారు.



దాడి శ్రీనుకు నియామకపత్రం అందిస్తున్న గూడూరు సీతామహాలక్ష్మి



ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తాతయ్యబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముత్యాలు తదితరులు

మర్యాదపూర్వక కలయిక

పరవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బత్తుల తాతయ్యబాబును ఆదివారం తెదేపా సీనియర్ నేత, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు తదితరులు ఆదివారం చోడవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని కలిశారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు చింతకాయల అమ్మోరు, అర్జిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2007-08 బ్యాచ్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినుల కలయికను ఆదివారం నిర్వహించారు. వీరంతా 16 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆట పాటలతో సందడి చేశారు. వారు చేస్తున్న వృత్తి, కుటుంబ వివరాలను వేదికపై వెల్లడించారు. పూర్వ విద్యార్థినుల్లో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా అందరూ కలిసి ఆదుకుంటామని, ఏటా ఒకచోట కలుసుకుందామని తీర్మానం చేసుకున్నారు. అనంతరం అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గెడ్డం ఉమ, మరిశా సంతోషి, నగిరెడ్డి రోజా, బండారు శ్యామల, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాల సమస్య పరిష్కరించాలని వినతి



భీమిలి ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందిస్తున్న పంచగ్రామాల భూముల కమిటీ ప్రతినిధులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల్లోని కాలనీ అసోసియేషన్‌లు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం (పంచగ్రామాల భూముల కమిటీ) ఆదివారం ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును నగరంలో కలిసి వినతులిచ్చి సమస్యలు వివరించారు. ఈ నెల 25వ తేదీన నగరంలో పంచగ్రామాల భూసమస్యపై కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరగనుందని గంటా చెప్పినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. నవంబరు 6వ తేదీన హైకోర్టులో వాయిదా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని వెలగపూడి చెప్పారన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, కోశాధికారి సీహెచ్.సత్యనారాయణ, సభ్యులు హనుమంతరావు, కృష్ణారావు, వి.నరసింగరావు, సూర్యనారాయణ, లక్ష్మీ, రాంబాబు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేవీ నవరాత్రి ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు



ఆర్టీసీ డిపోలో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమ

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం దరి సింహాచలం ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి అమ్మవారికి ఉద్యోగులు ప్రత్యేక పూజలు చేశారు. ముగింపు పూజల్లో ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.రమణారెడ్డి, అదనపు కార్యదర్శి శ్రీనివాసరాజు, కోశాధికారి వీవీవీ మోహన్, జిల్లాలోని పలు డిపోలకు చెందిన అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. డిపో ఉద్యోగులంతా ఐక్యతతో దేవీ నవరాత్రులు జరుపుకోవడం సంతోషకరమని రమణారెడ్డి కొనియాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడంతో ఉద్యోగుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం వంటివి అలవడుతాయన్నారు.

భారీ అన్నసమారాధన

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డి కూడలిలోని శ్రీకనకదుర్గ ఆటో స్టాండ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి సన్నిధి వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా చేరుకుని అన్నదానం స్వీకరించారు. సాయంత్రం పురవీధుల్లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగించి అనంతరం అప్పికొండ తీరంలో నిమజ్జనం చేశారు. స్థానిక నేతలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



నమ్మిదొడ్డి కూడలిలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న అతిథులు, కమిటీ ప్రతినిధులు

గణనాథుడికి సంకటహర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని వేంకటాద్రి ఘాట్ రోడ్డులో కొలువైన క్షేత్ర పాలకుడు ఆయుష్య గణపతి సన్నిధిలో ఆదివారం విశేష పూజలు జరిపారు. వేంకటాద్రి ఆలయ ప్రధానార్చకుడు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో వేకువజామున అర్చకులు వినాయకుడికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నూతన వస్త్రాలతో స్వామిని అలంకరించి అష్టోత్తర శతనామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో లంబోధరుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాకాసి గుంతలు.. ప్రమాదానికి నిలయాలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జెఎన్ ఫార్మాసిటీలోని గ్రాన్యూల్స్ యూనిట్-5 కంపెనీ మార్గంలో రహదారి ధ్వంసమైంది. ఇక్కడ రహదారిలో పెద్దపెద్ద గుంతలు పడటంతో పాటు రాళ్లుతేలడంతో రాకపోకలు సాగించడానికి ఇక్కట్లు తప్పడం లేదని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా కార్మికులు, ఉద్యోగులతో పాటు భారీ వాహనాలతో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షపు నీరు గుంతల్లో చేరి లోతు తెలియక వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక్కడ కాలువల నిర్మాణం జరగకపోవడంతో వరద నిలిచిపోయి రోడ్లు దెబ్బతింటున్నాయని కార్మికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.



రహదారిలో భారీ గుంతలు

వేగ నిరోధకాలపై రంగులు

వేపగుంట, న్యూస్‌టుడే

బీఆర్టీఎస్, ప్రహ్లాదపురం రహదారిలో ప్రమాదాల నివారణ కోసం జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వేగనిరోధకాలు నిర్మించారు. ఇవి దగ్గరకు వచ్చే వరకు ప్రయాణికులకు కనిపించకపోవడంతో ప్రమాదాలు మరింత ఎక్కువయ్యాయి. వేగనిరోధకాలపై తెలుపు రంగులు, రేడియం స్టిక్కర్లు వేయాలని ప్రజలు నిరసన తెలిపారు. దీనిపై 'బీఆర్టీఎస్‌లో అడుగడుక్కీ గండం' శీర్షికతో ఈనెల 17న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు స్పందించారు. ట్రాఫిక్ ఎస్సైలు విజయ్‌కుమార్, ఎస్.నర్సింగరాజు పర్యవేక్షణలో వేగనిరోధకాలపై తెలుపు రంగు వేయించడంతో పాటు పలుచోట్ల రేడియం స్టిక్కర్లు అమర్చారు. తెలుపురంగు మధ్యలో కొద్దిరోజుల తర్వాత ఎరుపురంగు వేయించడం జరుగుతుందన్నారు.

ఈనాడు కథనానికి స్పందన



వేగనిరోధకాలపై తెలుపు రంగు వేసే పనులను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఎమ్మెల్యే కార్యాలయం రోడ్డులో మురుగు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డులో మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ 95వ వార్డు పరిధి సుజాతనగర్ 80 అడుగుల రహదారిలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోంది. పెద్దఎత్తున మురుగు బయటకు వచ్చి రోడ్డుపై ప్రవహించడంతో అపరిశుభ్రంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన దుర్వాసనతో వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్నామని పాదచారులు, ద్విచక్రవాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



దర్పణం

వరదనీటితో తప్పని తిప్పలు..

వేపగుంట, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ప్రజలు అవస్థలు తప్పడం లేదు. జీవీఎంసీ 93వ వార్డు సమతాకాలనీలో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. రహదారి మధ్యలో కాలువ ఉండటంతో దానిపై ఎత్తుగా కల్వర్టు కట్టారు. దీంతో కల్వర్టు అవతల, ఇవతల నీరు నిలిచిపోతోంది. కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లే మార్గం లేకుండా పోయింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారిలోని కల్వర్టు వద్ద నిలిచిపోతున్న నీరు

సి ని మా లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– విశ్వం, చోటుమహరాజ్
(వెల్లంకి) – వేట్టయన్ ది హంటర్

శారదా పీఠం భూములు స్వాధీనం చేసుకోవాలి: విదసం

గ్రామీణభీమిలి: శారదా పీఠం కోసం భీమిలి మండలంలోని కొత్తవలస కొండను గత ప్రభుత్వం ధ్వంసం చేసిందని విదసం రాష్ట్ర కన్వీనరు బూసి వెంకటరావు అన్నారు. వైకాపా హయాంలో అడ్డుగోలుగా కేటాయించిన 15 ఎకరాల భూములను వెనక్కి తీసుకుంటూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ కొత్తవలస కొండను ఆదివారం సందర్శించి నీలి జెండాలను పాతిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనక్కి తీసుకున్న భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు.

భీమిలి

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: గోల్డెన్ హోటల్ (ముసలయ్యపాలెం) పార్కు పరిసరాల్లో మందుబాబుల బెడద ఎక్కువగా ఉంది. **–హరి, స్థానికుడు**

సమాధానం: మందుబాబులపై కేసులు నమోదు చేస్తాం. **–అప్పలనాయుడు, ఆరిలోవ పోలీసులు**

సమస్య: రుషికొండ కూడలిలోని పలు దుకాణాల వద్ద నిత్యం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. **–కిరణ్ సాయి, రుషికొండ**

సమాధానం: సంబంధిత కూడళ్లలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూస్తాం.
–కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్, ట్రాఫిక్ సీఐ

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: సూర్య తులసినగర్ (పీఎంపాలెం) మసీదు రోడ్డులో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పలుచోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి.
–పి.శ్రీనివాసరావు, పీఎంపాలెం

సమాధానం: క్షేత్ర స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం.
–సింహాచలం, జోన్–2 కమిషనర్

ప్రాధాన్య మార్గాల్లో నిత్యం ఇక్కట్లే..

సాగర్‌నగర్, న్యూస్‌టుడే

బీచ్‌రోడ్డులోని రుషికొండ, సాగర్‌నగర్, కార్తికవనం తదితర ప్రధాన కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. నిత్యం అధిక సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగించడంతో పాటు వేల సంఖ్యలో వాహనాలు తిరిగే సంబంధిత ప్రధాన కూడళ్లలో చోటుచేసుకున్న పరిణామాలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు వాహనచోదకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. పర్యాటకంగా పేరు గాంచి, విశాఖ నగరానికే మణిహారంగా నిలిచే ప్రాధాన్య మార్గంలో ఇలాంటి సమస్యలు తిష్ఠ వేయడం శోచనీయం. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి త్వరితగతిన వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతాల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కార్తికవనం వద్ద దెబ్బతిన్న వేగనిరోధకాలు

★ రుషికొండ కూడలి బీచ్‌రోడ్డులో వాహనాల వేగాన్ని నియంత్రించేలా పక్కాగా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో పాటు నేరనియంత్రణ దిశగా నెలకొల్పిన సీసీ కెమెరాలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి.

★ ముఖ్యంగా భీమిలి వైపు నుంచి ఎండాడ (జాతీయ రహదారి), గీతం ఆసుపత్రి తదితర ఎన్నో ప్రాంతాలకు వెళ్లేందుకు, వీఎంఆర్‌డీఏ మార్గంలోకి ప్రవేశించే క్రమంలోనూ.. నగరం నుంచి నేరుగా ఐటీ సెజ్ కూడలి వైపునకు వెళ్లేటప్పుడు వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

★ కార్తికవనం పరిసరాల్లో పలు వేగ నిరోధకాలు దెబ్బతిని ప్రమాదాలకు కారకాలుగా మిగిలాయి.

★ సాగర్‌నగర్ వద్ద సిగ్నల్ లైట్లు మరమ్మతులకు గురై అలంకార ప్రాయంగా మారాయి.

★ వాహన చోదకులు ఆమడ దూరంలోనే మలుపు ప్రదేశాల్ని గుర్తించే సూచిక బోర్డులు పలుచోట్ల దెబ్బతిని కానరాకుండా పోయాయి.


ప్రమాదకరంగా రుషికొండ ముఖ్య కూడలి

భద్రతా చర్యలు పునరుద్ధరించాలి

బీచ్‌రోడ్డు ప్రాధాన్యం దృష్ట్యా సంబంధిత ప్రాధాన్య కూడళ్లలో ప్రమాదాల నివారణ దిశగా సిగ్నల్ లైట్లు పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అలాగే వాహన చోదకులు రాత్రి వేళ సైతం గుర్తించే విధంగా వేగనిరోధకాల పరిసరాల్లో రేడియమ్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. డివైడర్‌పై విద్యుత్తు స్తంభాలకు అమర్చిన అన్ని ఎల్ఈడీ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా కొత్తగా ఇటు వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదకర మలుపు ప్రాంతాల్ని ఆమడ దూరంలోనే గుర్తించేలా కొత్తగా సూచిక బోర్డులు నెలకొల్పాలి.



–చెన్నా దాసు, మాజీ సర్పంచి

పంచగ్రామాల సమస్య పరిష్కరించాలని వినతి

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల్లోని కాలనీ అసోసియేషన్‌లు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం (పంచగ్రామాల భూముల కమిటీ) ఆదివారం ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును నగరంలో కలిసి వినతులిచ్చి సమస్యలు వివరించారు. ఈ నెల 25వ తేదీన నగరంలో పంచగ్రామాల భూసమస్యపై కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరగనుందని గంటా చెప్పినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. నవంబరు 6వ తేదీన హైకోర్టులో వాయిదా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని వెలగపూడి చెప్పారన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, కోశాధికారి సీహెచ్.సత్యనారాయణ, సభ్యులు హనుమంతరావు, కృష్ణారావు, వి.నరసింగరావు, సూర్యనారాయణ, లక్ష్మీ, రాంబాబు, రాము, తదితరులు పాల్గొన్నారు.


భీమిలి ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందిస్తున్న పంచగ్రామాల భూముల కమిటీ ప్రతినిధులు


తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణబాబుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అ వీ ఇ వీ

● అంతర్జాతీయ సదస్సులో ఎన్ఆర్‌డీసీ డీఎం

మధురవాడ, న్యూస్‌టుడే: ముంబయి వేదికగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల జరిగిన 19వ ఇండియా కెమ్-2024 సదస్సులో మధురవాడ ఐటీ ప్రాంగణంలోని ఎన్ఆర్‌డీసీ శాస్త్రవేత్త, డిప్యూటీ మేనేజర్ డాక్టర్ భవ్యమంజరి పాత్రుని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, రసాయన, పెట్రో కెమికల్ రంగాల్లో సాంకేతికాభివృద్ధి దిశగా ఏపీ ప్రభుత్వం, ఎన్ఆర్‌డీసీ ఎంతో కృషి చేస్తున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన పారిశ్రామిక విధానం, విశాఖలో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ద్వారా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు చేకూరే ప్రయోజనాలను, ఎన్ఆర్‌డీసీ కార్యకలాపాలు, కెమికల్ పరిశ్రమలకు అందిస్తున్న సహకారం తదితరాలను కూడా ఆమె ప్రస్తావించినట్లు సంబంధిత వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

● సంగివలసలో నేత్రవైద్య శిబిరం

సంగివలస(తగరపువలస), న్యూస్‌టుడే: వెంపాడ వెల్ఫేరు సొసైటీ, 'గంటా శారదమ్మ హెల్పింగ్ హ్యాండ్స్' సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో సంగివలస సుఖీభవకాలనీ వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రామభద్రరాజు పర్యవేక్షణలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది సుమారు 105 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 39 మందిని కంటి శుక్లాల శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వెంపాడ సొసైటీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది పైడిరాజు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● రౌడీ మూకల హల్‌చల్

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: జీవీఎంసీ నాల్గోవార్డు పరిధి కె.నగరపాలెంలో రౌడీ గ్యాంగ్‌లు శనివారం రాత్రి హల్‌చల్ చేశాయి. ఓ పాన్‌షాపులో సిగరెట్లు తీసుకుని డబ్బులు ఇవ్వకపోవడంతో మొదలైన వివాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనం పెట్టి రాకపోకలకు అంతరాయం కలిగించడంతో స్థానికులు పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని గంజాయి మత్తులో ఉన్న రౌడీ మూకలను హెచ్చరించి పంపడంతో వివాదం సద్దుమణిగింది.

● 25న భీమిలి అభివృద్ధిపై సమావేశం

తగరపువలస, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గ అభివృద్ధిపై ఈనెల 25వ తేదీన జిల్లా అధికారులతో రౌండు టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని చెన్నా ఫంక్షన్ హాలులో ఈ సమావేశం జరగనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో పాటు అన్ని శాఖలు, విభాగాల జిల్లాస్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరై గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకి సమాంతరంగా భీమిలిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్న దానిపై చర్చించి ప్రణాళిక రూపకల్పన చేయనున్నారన్నారు.



అంతా కృష్ణ మయం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు, వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శ్రీకృష్ణ భగవానుడిని స్మరిస్తూ ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు మందిరంలోని రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నృసింహస్వాముల విగ్రహాల్ని ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో ఆకర్షణీయంగా అలంకరించారు. లోకకల్యాణార్థం ఉత్సవమూర్తుల మహిమలు, గొప్పతనాన్ని వర్ణిస్తూ భజనల నిర్వహణ, గీతాలాపానలు చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ పేర్కొన్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేదపఠనముల స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాల భోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం ఆదే వేదికపై స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.


పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

ఘనంగా దీపారాధన

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డు పరిధి మారికవలస రాజీవ్‌గృహకల్ప కాలనీలో గ్రామపెద్దలు కావ్య, శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీకనక దుర్గమ్మ అమ్మవారిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం చేపట్టిన దీపారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నేటి నుంచి మరిడిమాంబ ఉత్సవాలు



భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి మరిడిమాంబ ఉత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ మధ్య ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈమేరకు భీమిలి కళ్లవీధి, నల్లివీధి, అప్పికొండవీధి, కొంకివీధి, గాడువీధి, కృష్ణాకాలనీ ప్రాంతాలకు చెందిన నాగవంశీయులు పూర్వం నుంచి ఈ అమ్మవారిని కొలుస్తున్నారు. ప్రతీ రెండేళ్లకోసారి ఈ వేడుకలు జరుగుతాయి. ఈనెల 21న తొలేళ్లు, 22న అనుపోత్సవం, 23న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమ్మవారి తొలేళ్ల వేడుక అనంతరం ఈనెల 22వ తేదీ మంగళవారం తెల్లవారుజాము నుంచి మరిడిమాంబ దేవాలయంలో భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పిస్తామని ఆలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు పేర్కొన్నారు.

అనంతుని పవిత్రోత్సవాలు



పద్మనాభం, న్యూస్‌టుడే: ఈనెల 27వ తేదీ నుంచి పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుని పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి తెలిపారు. 27వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమై, 28న అగ్ని మథనం, 29న పంచామృతాభిషేకం, స్వామివారికి పవిత్రాల సమర్పణ, 30న పవిత్రాల విసర్జన, పూర్ణాహుతి, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాటితూరు(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాల్వలు, తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ముందుగా తాటితూరులో రూ.50లక్షలతో, సింగనబందలో రూ.40లక్షలు, లక్ష్మీపురంలో రూ.50 లక్షలు, టి.నగరపాలెంలో రూ.20 లక్షలతో చేపట్టిన పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం సింగనబందలో నిర్వహించిన రచ్చబండలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. భీమిలి గ్రామాలను జీవీఎంసీలో విలీనం చేయడం ద్వారా రానున్న కాలంలో ఈ ప్రాంతం మహానగరంగా మారనుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, భాజపా, తెదేపా ఇన్‌ఛార్జులు కంటుభుక్త రామానాయుడు, కోరాడ రాజబాబు, మండలశాఖ అధ్యక్షుడు డీఏఎన్ రాజు(తెదేపా), నక్కా శ్రీధర్(జనసేన), మాజీ జడ్పీటీసీ సభ్యుడు సరగడ అప్పారావు, ఎమ్పీడీవో ఎన్.హనుమంతురావు, నాయకులు కొప్పల రమేశ్, గాడు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ప్రజలపై నిత్యావసరాల ధరల పిడుగు: సీపీఐ

మధురవాడ, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. 7వ వార్డు మధురవాడ కృష్ణానగర్, కళానగర్ ప్రాంతాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం పెరిగిన ధరలు తగ్గించాలని ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ధరాభారం వల్ల మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా విద్యుత్తు ఛార్జీల పేరిట రూ.50 వేల కోట్లు ప్రజలపై భారం వేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల పేరుతో రూ.17 వేల కోట్లు అదనపు భారం వేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మధురవాడ సీపీఐ కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎన్.త్రినాథ్, పి.రమణ, షేక్ మసీనా, ప్రసాద్ రాము తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు

వివేకానంద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు



ఎండాడ, న్యూస్‌టుడే: వివేకానంద్‌నగర్(ఎండాడ) కాలనీ పార్కు అభివృద్ధికి సంబంధించి వివేకానంద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్తగా ఏర్పడింది. ఈ మేరకు ఆదివారం పార్కులో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా మంతెన పెద్దిరాజు, అధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శిగా ఆర్.ఉదయ్, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వర్రావు, జాయింట్ సెక్రటరీలుగా వెంకటేష్, భానుమతి, కోశాధికారిగా మురళీకృష్ణ, సభ్యులు తదితరులు బాధ్యతలు స్వీకరించారు.

తిమ్మాపురంలో అక్రమంగా నీటి వ్యాపారం

తిమ్మాపురం (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: జీవీఎంసీ నాల్గో వార్డు గొల్లల తిమ్మాపురంలో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేసి తగరపువలసకి చెందిన ఓ వైకాపా ముఖ్యనాయకుడు, ఆయన కుటుంబీకులు, బంధువులు భారీ ఎత్తున నీటిని అమ్ముకుంటున్నారు. ఈయనకు తిమ్మాపురంలో బంధువులు ఉండడంతో అడ్డూ అదుపు లేకుండా లాభసాటిగా ఉన్న అక్రమ నీటి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. హేచరీల్లో రొయ్య పిల్లల పెంపకానికి మంచినీరు అవసరం కావడంతో తిమ్మాపురం ప్రాంతంలో ఉన్న పలు హేచరీలకు నీటిని తరలించి అక్రమార్జన చేస్తున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.2 వేలకి అమ్ముతున్నారు. పెట్టుబడి లేని వ్యాపారం కావడంతో ఈ విధంగా వేకువజామున నాలుగు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ మళ్లీ మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అధికార యంత్రాంగం కళ్లుగప్పి నీటిని తోడేస్తున్నారు. దీనిపై అన్ని ఖర్చులూ పోనూ నెలకి రూ.రెండు నుంచి మూడు లక్షల వరకూ ఆదాయం రావడంతో అడ్డుచెప్పిన వారికి లంచాలు ఇచ్చి తమ పని కానిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానికంగా ఉన్న పలువురు జీవీఎంసీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు తూతూమంత్రంగా వ్యవహరిస్తూ వదిలేయడంతో అక్రమ నీటి వ్యాపారం ఆగడం లేదు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమ పద్ధతిలో నీటి వ్యాపారం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


అక్రమంగా హేచరీలకు నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ఉచిత హోమియో వైద్య శిబిరం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు డా.జగన్నాథరావు, డా.మోహనరావు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎం.శంకర్, జి.రాము, దివ్య, భారతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాలనీలో మద్యం దుకాణం వద్దంటూ నిరసన

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు ఐటీ హిల్స్ రోడ్డు వికలాంగుల కాలనీలో నివాస సముదాయాల మధ్య కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై నివాసిత ప్రజలు ఆదివారం ఆందోళన చేశారు. దుకాణం నిర్వహణ వల్ల ఎన్నో సమస్యలు వస్తాయని, మహిళలు, విద్యార్థినులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. ఇక్కడ దుకాణాన్ని వేరే చోటికి తరలించాలని డిమాండ్ చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎన్.ప్రసాద్, టి.వెంకటరమణ, బి.అనిల్, జి.వీరాచారి, ఎం.హరిదేవి, భూపాల్, ప్రసాద్, రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో సందర్శకుల కోలాహలం



సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. అందాలకు నెలవైన ఇసుక తిన్నెలు, మెరైన్ పోలీసుటవర్, టూరిజం కుటీరాలు, బోటింగ్ కేంద్రం, మత్స్యరాశుల పార్కు తదితర ఆహ్లాదకర ప్రదేశాల్లో ఉత్సాహంగా... ఉల్లాసంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

వేగ నియంత్రికలు ఇలా ఉంటే ఎలా..

పీఎంపాలెం: జాతీయ రహదారిపై క్రికెట్ స్టేడియం కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన వేగ నియంత్రికలు ప్రమాదకరంగా మారాయి. రద్దీగా ఉండే కూడలిలో వాహనాల వేగం అరికట్టేందుకు పోలీసులు శిథిల నియంత్రికలను ఇక్కడ ఏర్పాటు చేశారు. కేవలం పైపులు మాత్రమే కనిపిస్తున్న నియంత్రికలను రోడ్డు మధ్యలో పెట్టడంతో రాత్రి వేళ వాహనచోదకులు వాటిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. తమ వ్యాపార ప్రచారం నిమిత్తం పలు ప్రయివేటు సంస్థలు అందించిన నియంత్రికలు పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద కుప్పలుగా పడి ఉండగా.. వాటిని వదిలేసి దెబ్బతిన్న నియంత్రికలను కూడళ్లలో కొనసాగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పీఎంపాలెం క్రికెట్ స్టేడియం కూడలిలో..

అందాల తీరం.. వ్యర్థాలమయం



సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గుడ్లవానిపాలెం(సాగర్‌నగర్) పరిసర సముద్రంలో నుంచి అధిక సంఖ్యలో వ్యర్థాలు ఆదివారం కొట్టుకొచ్చాయి. సముద్ర జలాలు కలుషితమయ్యేలా పర్యావరణానికి హాని కలిగించే రీతిలో కనిపించిన ఈ దృశ్యాల్ని చూసిన ప్రకృతి ప్రేమికులు నిరుత్సాహానికి గురయ్యారు. నగర పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వస్తున్న వ్యర్థాలు సాగరంలో నేరుగా కలుస్తుండడంతో సహజసిద్ధ అందాలకు నెలవైన బీచ్‌ల్లో ఈ తరహా సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో బీచ్‌రోడ్డులోని వంతెనల వద్ద వ్యర్థాలు నిలిచిపోయి మురుగునీరు మాత్రమే తీరంలో కలిసేలా ఇనుప చువ్వలు ఏర్పాటు చేస్తే ఈ తరహా సమస్య పునరావృతం కాదని స్థానికులు జీవీఎంసీ ఉన్నతాధికారుల్ని కోరుతున్నారు.

విశాఖ తూర్పు

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఏపీఈపీడీసీఎల్ జోన్-1 డివిజన్ పరిధిలో ఎంవీపీకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో సెక్టారు-6 ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈనెల 21న పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ సింహాచలనాయుడు తెలిపారు. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎంవీపీకాలనీలోని సెక్టారు-6, సెక్టారు-2, మెడికవర్ ఆసుపత్రి వెనుక ప్రాంతం, అంజయ్యనగర్, సాయిబాబా దేవాలయం రోడ్డు, శ్యామల డ్రైఫ్రూట్స్ ఎదురుగా రహదారి తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని, ఆయా ప్రాంతాల్లోని విద్యుత్తు వినియోగదారులు తమ శాఖతో సహకరించాలని కోరారు.

క్రీడలతో స్నేహభావం అలవడుతుంది

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : క్రీడల వల్ల యువతలో ఒకరి పట్ల ఒకరికి స్నేహభావం అలవడుతుందని ఉపకార్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. ఆరిలోవ కాలనీ శ్రీకాంత్‌నగర్ చివరి భాగంలో గల క్రీడా మైదానంలో ఆదివారం ప్రారంభమైన ఉపకార్ క్రికెట్ టోర్నీ-2024 సీజన్ 2 ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఉపేంద్రబాబు, సుధీర్, రెహ్మాన్, నాగు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229
– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-6 ఏపీ ఎలక్ట్రికల్ హౌస్ ఎదురుగా ఉన్న పోల్‌పై రెండు వీధి దీపాలు వెలగటం లేదు.
– హనుమంతురావు

సమాధానం : పరిశీలించి పాడైన దీపాలను మారుస్తాం.
– విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

శిక్షణే.. రక్షణ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

సాధారణంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఉన్నత చదువుల్లో విద్యార్థులకు ఈ తరహా శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే ఇప్పుడు పాఠశాల విద్యార్థులకు కూడా ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా తోటగరువు హైస్కూలులో యునిసెఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

సెలవుల సమయంలో..

పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఆసక్తిగల వారిని ఎంపిక చేసి ఆటోమొబైల్, వ్యవసాయం అనే అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఇందుకు ఇద్దరు శిక్షకులను కూడా నియమించారు. ప్రతిరోజూ తరగతి గదిలో అంశాలను బోధించటంతో పాటు దసరా, క్రిస్మస్, సంక్రాంతి సెలవులను ఇంటర్న్‌షిప్‌నకు ఉపయోగించుకుంటున్నారు.



బైక్ మెకానిజం తెలుసుకుంటున్న విద్యార్థులు

ముందుకు వచ్చిన పలు సంస్థలు..

యునిసెఫ్ ఫౌండేషన్ వారు వృత్తివిద్యలో శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వీరు ఆటోమొబైల్, వ్యవసాయం అనే రెండు అంశాలలో శిక్షణ ఇస్తారు. మ్యాజిక్ బస్ ఫౌండేషన్ విద్యార్థుల్లో క్రీడలు, వ్యక్తిత్వవికాసం, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలలో శిక్షణ అందిస్తున్నారు. నాందీ ఫౌండేషన్ అనే సంస్థ బాలికలకు పాఠశాల అనంతరం పునశ్చరణ బాధ్యతలు తీసుకున్నారు. బుద్ధ యోగా ఫౌండేషన్ సంస్థ వారు విద్యార్థులలో యోగా, ధ్యానంలో శిక్షణ అందిస్తున్నారు.

ఇంజిన్ గురించి వివరించారు



మాకు పాఠశాలలో ద్విచక్ర వాహనం, నీటి బోర్ ఇంజిన్ పనితీరు గురించి వివరించారు. దసరా సెలవుల్లో హనుమంతవాకలోని ఆటోమొబైల్ సర్వీసింగ్ కేంద్రానికి తీసుకుని వెళ్లారు. అక్కడ మోటారు ఎలా పనిచేస్తుంది, దాని పనితీరుకు కావలసిన వస్తువులు, ఇంధనాలు ఎలా వేయాలి వాటి ఆవశ్యకతను వివరించారు. – జి.నిరీష, విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్ తోటగరువు

పరికరాల పనితీరు బాగా అర్థమైంది



ఇంట్లో భాగంగా మంచినీరు తోడేందుకు వాడే మోటారును విడదీసి, తిరిగి బిగించే ప్రక్రియ నాకు నచ్చింది. అందులో వాడే పరికరాలు ఒక్కొక్క పరికరం పనితీరు దాని అవసరం వివరించారు. అది రాసుకుని అవగాహన పెంచుకున్నాం. వాడకంలో జాగ్రత్తలు, తీసుకోవలసిన రక్షణ చర్యలు బాగా అర్థం అయ్యాయి. – భువనచంద్రిక, పదో తరగతి విద్యార్థిని

విద్యార్థులకు వృత్తివిద్యల్లో అవగాహన కల్పించాలనే..



కేవలం చదువే అందించటమే కాకుండా విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఇంటర్న్‌షిప్ అందిస్తున్నారు. ఆసక్తిగల విద్యార్థులను కేటాయించి శిక్షణను పరిశీలించేందుకు కొంతమంది ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జ్‌గా అప్పగించి శిక్షణను పరిశీలించి పర్యవేక్షణ చేస్తున్నాం. – జీకే దుర్గాభవాని, ప్రధానోపాధ్యాయిని, జెడ్పీహెచ్ఎస్ తోటగరువు

బార్, పబ్‌లలో తనిఖీ


పబ్‌ల నిర్వహణను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో శనివారం రాత్రి పోలీసులు నగరంలోని పబ్, బార్‌లను తనిఖీ చేశారు. ఎక్సైజ్ శాఖ జారీచేసిన లైసెన్స్, ఫుడ్ లైసెన్స్, అగ్నిమాపకదళ అధికారులు జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రం, పార్కింగ్, ట్రేడ్ లైసెన్స్ వంటి వాటిని పరిశీలించేందుకు తనిఖీలు జరిపారు. ఆయా బార్, పబ్‌లలో సీసీ కెమెరాలున్నవి. . లేనివి పరిశీలించారు. ఒక పబ్ వద్ద పార్కింగ్ లేదని గుర్తించారు. నిబంధనలకు పాటించని వారికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో ప్రజలు 7995095799 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

క్రీడలు, ప్రతిభ ఉంటే ఉపాధికి ఢోకా లేదు


విజేతలైన క్రీడాకారులతో ఏయూ వ్యాయామ విద్యా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, తదితరులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : క్రీడలతో పాటు చదువులో ప్రతిభ ఉంటే మంచి ఉపాధి అవకాశాలు వస్తాయని ఏయూ వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్, దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయ మోహన్ అన్నారు. ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానంలో గల బాస్కెట్ బాల్ కోర్టులో ఏయూ ఇంటర్ కాలిజియేట్ బాస్కెట్ బాల్ పురుషుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మిసెస్ ఏవీఎన్ కళాశాలకు, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులకు మధ్య జరిగిన ఫైనల్స్‌లో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టుకు 28 పాయింట్లు, ఏవీఎన్ కళాశాలకు 34 పాయింట్లు వచ్చాయి. ఈ పోటీల్లో ఏవీఎన్ కళాశాల ప్రథమ స్థానంలో నిలవగా, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడో స్థానాన్ని ఏయూ ఆర్ట్స్ కళాశాల కైవసం చేసుకుంది. క్రీడాకారులను ఆచార్య విజయమోహన్ అభినందించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ కోచ్ బి. రామయ్య, కోచ్ రామచందర్, పి.డి. డాక్టర్ లక్ష్మణరెడ్డి, గోపీకృష్ణ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ తెలుగు ఆచార్యుడికి అబ్దుల్ కలాం పురస్కారం


నిర్వాహకుల నుంచి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ బూసి వెంకటస్వామి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతిభావంతులకు ఇచ్చే డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి అందుకున్నారు. గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో ఎస్.పి.ఎల్.టి.ఒ. (సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న వెంకటస్వామికి ఏయూ తెలుగు విభాగం ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

వివాదంలో సీతారామ సేవా సంఘం స్థలం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : పాత వెంకోజీపాలెం గవర వీధిలోని సీతారామ సేవా సంఘం స్థలం వివాదంలో పడింది. వందేళ్ల చరిత్ర కలిగిన పెద్దనుయ్యి కలిసి ఉన్న 3 సెంట్ల భూమిని స్వాధీనం పరిచేందుకు నాలుగు నెలల నుంచి సంఘం ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. ఈ స్థలం వ్యవహారంలో పలువురు స్థలం మాదంటూ వచ్చారు. వారందరితో గ్రామస్థులు చర్చలు జరిపారు. ఈలోగా సంఘం ప్రతినిధులు ప్రహరీని నిర్మించేందుకు ఉపక్రమించారు. దీంతో గోపాలపట్నంకు చెందిన ఓ కార్పొరేటర్ స్థలం తనదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు స్థలం వద్దకు వచ్చి ప్రహరీ నిర్మాణ పనులు నిలిపివేశారు. దీంతో ఈ స్థలం వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు సీతారామ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు.


వివాదాస్పద స్థలం వద్ద పోలీసులు, గ్రామస్థులు

బీచ్‌రోడ్డులో అవగాహన పరుగు


పరుగులో పాల్గొన్న యువకులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంలో భాగంగా ఆర్.కె.బీచ్ నుంచి వుడా పార్కు వరకు ఆదివారం ఉదయం అవగాహన పరుగు నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత్ నివేశ్ రన్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధి వెంకటేష్ చలసాని మాట్లాడుతూ.. 14 నుంచి 20 వరకు ప్రపంచ పెట్టుబడుదారుల వారోత్సవాలు పురస్కరించుకొని రన్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

24న ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలిజియస్ ఫ్రీడమ్ (ఐఏఆర్ఎఫ్), బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ హార్మోనీ సంస్థల ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి 79వ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. గురువారం ఉదయం ఎంవీపీకాలనీ ఎస్.వి.వి.పి. వి.ఎం.సి. డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. సమితి పనితీరు.. సంస్కరణల ఆవశ్యకత గురించి వక్తలు అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తిగలవారు పాల్గొనాలని కోరారు.

నేడు మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్య అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, ఇన్ఫోసోర్స్, ఎస్.బి.ఐ. కార్డ్సు, డీమార్ట్ తదితర కంపెనీలు పాల్గొనే ఈ ఉద్యోగ మేళా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు సోమవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9966965502 ఫోన్‌నెంబరును సంప్రదించాలన్నారు.

విశాఖ జిల్లా యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాల్‌లో ఎన్నుకున్నారు. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం, అధ్యక్షుడిగా ఒమ్మి సన్యాసిరావు, కార్యదర్శిగా బొట్టా వెంకటరమణ, క్యాషియర్‌గా పిట్టా సురేష్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులు గొలగాని అప్పారావు, గొంప అప్పారావు, ప్రగడ చిన్నారావులు వ్యవహరించారు. నూతన కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుందన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న పలు కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు జిల్లా కన్వీనర్ ఉమ్మడి నితిన్ ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం సెలవురోజు కాగా నగరంలోని పలు కళాశాలలు సందర్శించామన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అచ్చిబాబు, నితిన్, ధనుష్ పలువురు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఎంవీపీ స్టేషన్ పరిధిలో వ్యభిచారగృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. శివాజీపాలెంలో ఓ నివాసంలో ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఇద్దరు మహిళలు, ఇద్దరు నిర్వాహకులు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఎంవీపీ స్టేషన్‌కు అప్పగించారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే: కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఉంచి దాడులు జరిపారు. ఆ సమయంలో కొంతమంది అనుమానితులను తనిఖీ చేశారు. ఐదుగురి వద్ద 29 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని సమాచారం. తదుపరి చర్యల నిమిత్తం ఐదో పట్టణ పోలీసులకు అప్పగించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ కార్యక్రమంలో భాగంగా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా అనకాపల్లి పైడిరాజు, అధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, సహాధ్యక్షులుగా ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, ప్రధాన కార్యదర్శిగా టీఆర్ అంబేడ్కర్, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, ఉప్పాడ రాము, మహమ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్, వంగా రామలక్ష్మి, టి.జగన్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.రవిబాబు, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎస్ఎస్ నాగమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ ప్రతినిధులను రాష్ట్ర కమిటీ ప్రతినిధులు నక్కా వెంకటేశ్వర్లు, రెడ్డి మోహనరావు, వి.శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.


యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన విరమణ


దీక్ష విరమించిన ఆర్టీసీ ఉద్యోగులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : న్యాయం చేయాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళన ఎట్టకేలకు విరమించారు. వాల్తేరు డిపోలో విధులు నిర్వహిస్తున్న ఓ కండక్టర్ తప్పు చేయకపోయినా యాజమాన్యం సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు న్యాయం చేయాలని గత 45 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తుండగా.. దీనిని ఆదివారం ముగించారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.రమణారెడ్డి యాజమాన్యంతో చర్చించిన మీదట దీక్షలు విరమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, వాల్తేరు డిపో కార్యదర్శి వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అవతార ప్రకటన దినోత్సవ ర్యాలీ

ఎం.వి.పి.కాలనీ, పెదవాల్తేరు, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా దివ్య అవతార ప్రకటన దినోత్సవం పురస్కరించుకుని అత్యంత వైభవంగా సంకీర్తన ర్యాలీ జరిపారు. ఆదివారం సాయంత్రం కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయం వద్ద సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు పీఆర్ఎస్ఎన్ నాయుడు సత్యసాయి పతకాన్ని ఊపి ప్రారంభించారు. సంకీర్తన ర్యాలీ పోలమాంబ ఆలయం నుంచి పెదవాల్తేరు కూడలి, బీచ్‌రోడ్డు, శాంతి ఆశ్రమం, లాసన్స్‌బేకాలనీ, ఉషోదయకూడలి మీదుగా సత్యసాయి ప్రేమసదన్‌కు చేరుకుంది. సత్యసాయి సిటీ సేవా సమితి కన్వీనర్ డి.వి.వి.సీతారామరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న పీఆర్ఎస్ఎన్ నాయుడు


శాంతి ర్యాలీలో బాబా భక్తులు

దేదీప్యమానంగా ప్రేమసదన్

సత్యసాయి సేవాసంస్థలకు చెందిన ప్రేమసదన్ విద్యుత్తు వెలుగులతో శోభాయమానంగా మారింది. వచ్చే నెలలో నిర్వహించబోయే సత్యసాయి జన్మదిన వేడుకల్లో భాగంగా విద్యుత్తు దీపాలతో అలంకరించారు. దీంతో ప్రేమసదన్‌ను కొత్త శోభ సంతరించుకుంది.
– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మీపతిరాజు

మురళీనగర్, న్యూస్‌టుడే : మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశాన్ని ఆదివారం మురళీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-29 సం॥ వరకు అమలులో ఉండే రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షులుగా కె.లక్ష్మీపతిరాజు, జనరల్ కార్యదర్శి సైకం రాంప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ పి.వి.కృష్ణారావు, బి.కృష్ణమూర్తి, వి.పాండురంగారెడ్డి, వై.కోటేశ్వరమ్మ, పి.అప్పారావు, కె.లతాదాస్, రామకుమార్, తదితరులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాంప్రసాద్ తెలిపారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్, జాతీయ అసోసియేషన్ తరఫున పరిశీలకులుగా వికాస్‌కరార్ వ్యవహరించారు.

మోసం చేశారంటూ ఫిర్యాదు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : అప్పు తీసుకొని ఓ మహిళ మోసం చేసిందంటూ ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించి ఆరిలోవ ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ సుందరయ్యనగర్‌కు చెందిన పోలిపల్లి సువర్ణ అదే కాలనీకి చెందిన నీలాపు స్వాతికి చెక్కుల ఆధారంగా పలు మార్లు రూ. 25 లక్షల అప్పు ఇచ్చింది. ఆ అప్పు అడగగా దాటవేస్తూ వచ్చిందని.. చివరికి చిరునామా సైతం మార్చిందని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన


పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే:సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రోల్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖకు చెందిన వివిధ పాఠశాలల నుంచి అండర్-14, 17 విభాగాల్లో పాల్గొన్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సతీష్ పేర్కొన్నారు. వీరిలో రాష్ట్రస్థాయి పోటీలకు 24 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని వివరించారు.

ఉద్యానవనం నిర్వహణ కరవు


నిలిచిన వర్షపునీరు


పాడైన వ్యాయామ పరికరం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే

వుడాపార్కు అపరిశుభ్రంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలాచోట్ల నీరు నిలిచిపోయింది. పర్యాటకులు తిరిగే ప్రాంతంలో నీటి నిల్వ కారణంగా అసహనం వ్యక్తంచేస్తున్నారు. గతంలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం ఉండేది. గతంలో చేసిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఆ మార్గాలను మూసివేయడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. ఉదయం పార్కు మొత్తం వాకర్స్ నడకకు వస్తారు. వీరికి ఇబ్బందికరంగా మారింది. కొంతమంది వాకర్స్ మోటారు సహాయంతో కాలువలోని మురుగునీరు తొలగిస్తామని ముందుకొచ్చినా అక్కడి సిబ్బంది అంగీకరించడం లేదు.

తగ్గిన సందర్శకులు

పార్కు నిర్వహణ లేకపోవడం, గతంతో పోలిస్తే ప్రవేశ రుసుము కూడా పెరగడంతో పర్యాటకులు తగ్గిపోయారు. గతంలో రూ.3 నుంచి రూ.5 టికెట్లు ఉండేవి, వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత రూ. 20 టికెట్ ధర పెంచడంతో ముఖ్యమైన రోజుల్లో తప్పా సాధారణ రోజుల్లో సందర్శకుల సంఖ్య తక్కువగా ఉంటోంది. గతంలో రోజుకు సుమారు 15 వందల నుంచి 2 వేల మంది వరకు సందర్శకులు వచ్చేవారు. ప్రస్తుతం 5 వందల మంది నుంచి 7 వందల మంది మాత్రమే వస్తున్నారు.


తేలిపోయిన మ్యాట్లు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

సమస్య: 41వ వార్డు రావులపల్లి వీధి నుంచి బాబుకాలనీకి వెళ్లే మార్గంలో యూజీడీ పైపు లైన్ల కోసం రహదారిని తవ్వారు. ఇప్పటికీ రహదారిని పునర్ నిర్మించ లేదు. వర్షం పడితే బురదగా మారుతోంది.
– పిల్లి గోవిందరాజు, జ్ఞానాపురం

సమాధానం: రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాం. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.
– ఈఈ మత్స్యరాజు

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
విశాఖ ఉత్తరం: 80747 24699
విశాఖ దక్షిణం: 80085 66543

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టర్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రోల్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖకు చెందిన వివిధ పాఠశాలల నుంచి అండర్-14, 17 విభాగాల్లో పాల్గొన్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సతీష్ పేర్కొన్నారు. వీరిలో రాష్ట్రస్థాయి పోటీలకు 24 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని వివరించారు. స్పోర్ట్స్‌పార్కు కార్యదర్శి సూర్యనారాయణరాజు, విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి తోట లలితప్రియ, శిక్షకులు పూసర్ల సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రోల్‌బాల్ క్రీడాకారులతో నిర్వాహకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కైలాసపురం ఫీడర్‌లోని 132 కె.వి.హెచ్.టి. లైన్స్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు చేపట్టనున్నందున ఈనెల 21న సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలంనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూరినగర్ 1, 2, మధుసూదన్‌నగర్, దుర్గాకైలాస్‌నగర్, సత్యసాయినగర్ ప్రధాన రహదారి, కైలాసపురం, వాసుదేవనగర్, సంజీవయ్యకాలనీ, గణేష్‌నగర్, గణేష్‌నగర్ సేవా సంఘం, నరసింహనగర్ ప్రధాన రహదారి, విశాఖ సదన్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కంచరపాలెం, న్యూస్‌టుడే: 11కేవీ బర్మా క్యాంప్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తున్నట్లు జోన్-2 విద్యుత్తుశాఖ ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా నలందనగర్, ధర్మానగర్, జాషువానగర్, రెడ్డికంచరపాలెం, జోగారావునగర్ ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదన్నారు. స్థానికులు సహకరించాలని ఆయన తెలిపారు.

39వ వార్డులో మహా అన్నదానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 39వ వార్డు చిలకపేటలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా అన్నదానానికి రూ.15వేలు విరాళం అందజేసినట్లు తెలిపారు. నిర్వాహక కమిటీ సభ్యులు రాజేష్, ధనరాజు, అప్పలరాజు, నూకరాజు, ముజీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి నియామకంపై హర్షం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో వైకాపాకు పూర్వ వైభవం వస్తుందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్రజిల్లాల సమన్వయకర్తగా విజయసాయిరెడ్డిని, జిల్లా అధ్యక్షుడిగా గుడివాడ అమర్‌నాథ్‌ను అధినేత జగన్ నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆల్ఫా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లలితాపీఠంలో శంకటహర చతుర్థి పూజలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని లలితా పీఠంలో శంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం దర్బార్ హాలులో జరిగిన పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి సేవలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ దగ్గరుండి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

26 వాహనాల స్వాధీనం

గురుద్వారా, న్యూస్‌టుడే: నాలుగోపట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు 'కార్డన్ సెర్చ్' నిర్వహించారు. ఏసీపీ లక్ష్మణమూర్తి.. స్టేషన్ సీఐ విజయ్‌కుమార్, సిబ్బందితో కలిసి నరసింహనగర్, కైలాసపురం, సత్యసాయినగర్, సాలిగ్రామపురం, సింహగిరికాలనీ, లెప్రసీకాలనీ, ఎంఈఎస్ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లు, 45 వాహనాల్ని తనిఖీ చేశారు. ఇందులో నంబరు ప్లేట్లు, దస్త్రాలు లేని 26 వాహనాల్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టర్-8 ఓం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు రగ్గులు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ వితరణ చేపట్టినట్లు అధ్యక్షులు వి.ప్రమీల తెలిపారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, క్లబ్ కార్యదర్శి నిర్మల, ధనలక్ష్మి, అప్పారావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీఠానికిచ్చిన భూములు వెనక్కి తీసుకోవడం హర్షణీయం

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం శారదా పీఠానికి ఇచ్చిన 15 ఎకరాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం హర్షణీయమని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతం ముసుగులో అక్రమాలకు పాల్పడిన శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి కూటమి ప్రభుత్వం బుద్ధి చెప్పిందన్నారు. కార్యక్రమంలో జిల్లా తెదేపా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, నాయకులు దువ్వి పరమేశ్వరరావు, కె.నరేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర జిల్లాల దొంగ అరెస్టు

నిందితుడిపై 30 కేసులు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో అరసవల్లి రోడ్డు తెలుగు ముసలయ్యకాలనీకి చెందిన వడ్డి సుజాత మెడలో నల్లపూసల గొలుసు తెంచి పరారైన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఆదివారం వివరాలు వెల్లడించారు. నిందితుడు విశాఖపట్నంలోని కంచరపాలెం సుభాష్‌నగర్‌కు చెందిన భీమరశెట్టి కమలానాథ్‌గా గుర్తించారు. ఇతడిపై 30 కేసులు ఉన్నట్లు తెలిపారు. మెకానిక్ దుకాణంలో పని చేసి ద్విచక్రవాహనాలను తాళాలు లేకుండా స్టార్ట్ చేయడం నేర్చుకుని ద్విచక్రవాహనాలు, బంగారు గొలుసులు దొంగలించడం ప్రారంభించాడని, బంగారాన్ని ఓ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో జల్సా చేసేవాడని వెల్లడించారు. ఈ క్రమంలో సామర్లకోట పోలీసులకు చిక్కడంతో అరెస్టయ్యాడన్నారు. ఆ తరువాత విడుదలైనా.. ప్రవర్తన మార్చుకోలేదని, కంచరపాలెం, అనకాపల్లి, విజయనగరం 2 టౌన్, శ్రీకాకుళం రూరల్, జామి, కొత్తవలస, అరిలోవ, అనపర్తి, ఎచ్చెర్ల, పెందుర్తి, సబ్బవరం, గోపాలపట్నం పోలీసు స్టేషన్లలో సుమారు 30 కేసులు నమోదయ్యాయని, 10 సార్లు జైలు శిక్ష అనుభవించినట్లు పేర్కొన్నారు. దొంగిలించి, తాకట్టు పెట్టిన బంగారాన్ని నిందితుడు ఇచ్చిన సమాచారంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బిగ్గరగా అరుపులు.. వెంటపడి దాడులు

41వ వార్డులో కుక్కల స్వైర విహారం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

జీవీఎంసీ 41వ వార్డులో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. జ్ఞానాపురానికి అనుకుని రైల్వేస్టేషన్ ఉండడంతో వయసు మీరిన, వ్యాధులతో ఉన్న కుక్కలను పలువురు యజమానులు వదిలేసి వెళ్లిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. జ్ఞానాపురంలో వీధికి కనీసం ఆరు కుక్కలు తక్కువ కాకుండా ఉన్నాయి. బాబుకాలనీ, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ పరిసర ప్రాంతాల్లో వీటి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోందని స్థానికులు వాపోతున్నారు. అవి ద్విచక్ర వాహనాల వెంట పరుగులు తీస్తుండడంతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతున్నాయని బాబుకాలనీ వాసులు వాపోతున్నారు. రే, బరిల్, సిరిల్ వీధుల్లో గుంపులుగా తిరుగుతున్నాయని, రాత్రుళ్లు బిగ్గరగా అరుస్తుండడంతో కంటిపై కునుకురావడం లేదని స్థానిక నివాసితులు అంటున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వడిచర్ల వీధిలో కుక్కల విహారం


గుంపుగా తిరుగుతూ..

24న వైభవిని దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

మురళీనగర్, న్యూస్‌టుడే: ఎన్‌జీజీఓకాలనీ వైభవిని దివ్యక్షేత్రంలో ఈనెల 24న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జయలక్ష్మిమాత మత్స్య మండలి, చింతామణి గణపతి దత్తక్షేత్రం ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు అన్నపూర్ణ భవనంలో జరిగే అన్న ప్రాశన వ్రతంలో భక్తులందరూ పాల్గొనవచ్చునన్నారు. పూజల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 98481 97727 లేదా 83740 22133 నెంబర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు తెలిపారు.

గద్దర్ పాటలతో ఉద్యమాలకు ఊపిరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న గద్దర్ కుమార్తె వెన్నెల

సీతంపేట, న్యూస్‌టుడే : గద్దర్ లాంటి కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల వల్లనే విప్లవంపై తన నమ్మకం నానాటికి బలపడుతోందని మహాకవి శ్రీశ్రీ వ్యాఖ్యానించడం గద్దర్ పాటకున్న ఔన్నత్యం తేటతెల్లమవుతోందని గద్దర్ కుమార్తె వెన్నెల అన్నారు. విశాఖ పౌరగ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం 'గద్దర్ అన్న యాదిలో' పేరిట కార్యక్రమం నిర్వహించారు. వెన్నెల మాట్లాడుతూ అడవిలో వెన్నెలమ్మ ఆకుని ముద్దాడుతున్నట్టుగా గద్దర్ గొంతును పాటమ్మ ముద్దాడిందన్నారు. గద్దర్ పాటకున్న శక్తి అంతా ఇంతా కాదని, ప్రభుత్వాలనే గడగడలాడించిన చరిత్ర ఉందన్నారు. పేద, మధ్య తరగతి, పీడిత వర్గాల కోసం పాటలు రాశారన్నారు. తాను జీవించినంత కాలం పాట కోసమే బతికారన్నారు. ఆయన పాటలు అనేక ఉద్యమాలకు ఊపిరి పోశాయన్నారు. ఈ సందర్భంగా ప్రజా గాయకులు మజ్జి దేవిశ్రీ గద్దర్ పాటలను పాడి అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ అర్జున్, మాటూరి శ్రీనివాసరావు, గంటా మోహనరావు, సినీ దర్శకులు సత్యారెడ్డి, వంగపండు దుష్యంత్, అవాల రమేష్‌బాబు, బొడ్డు కల్యాణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొయ్యి.. చూసి అడుగెయ్యి..!

దర్పణం



నరసింహనగర్‌లోని నాలుగు రోడ్ల కూడలి నుంచి చాణక్య టవర్స్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లే దారిలో రెండు నెలల క్రితం యూజీడీ మరమ్మతులు చేపట్టారు. పనుల్లో భాగంగా తవ్విన గొయ్యిని సరిగా పూడ్చకుండా వదిలేశారు. దీంతో డ్రైనేజీ మ్యాన్‌హోల్ చుట్టూ కుంగి పోయి మరింత పెద్ద గొయ్యిగా తయారయ్యింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతిలో నీరు నిల్వ ఉండిపోవడంతో పాటు దగ్గరకు వచ్చే వరకు గుంత కనిపించకపోవడంతో ద్విచక్రవాహన చోదకులు రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే

ఆంధ్ర బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

సీతంపేట, న్యూస్‌టుడే : ఆంధ్ర బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమావేశం ఆదివారం విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా సరసమైన ప్రీమియం ధరలతో లభించే బీమా పథకాల గురించి అఖిల భారత బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య సభ్యులు వివరించారు. కార్యక్రమంలో సమాఖ్య సహాయ ప్రధాన కార్యదర్శి టంకాల కామేశ్వరరావు, సభ్యులు సూర్య భాస్కర్, కేశవరావు, కృష్ణారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

హద్దు మీరితే చర్యలు తప్పవు

గురుద్వారా, న్యూస్‌టుడే: హద్దుమీరి ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని తూర్పు సబ్‌డివిజన్ ఏసీపీ లక్ష్మణమూర్తి హెచ్చరించారు. ఆదివారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకొని మెలగాలన్నారు. వీధుల్లో పంచాయితీలు చేయడం, ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి వారం స్టేషన్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. సీఐ విజయ్‌కుమార్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ విజయ్‌కుమార్

నూతన కార్యవర్గం ఎంపిక

మురళీనగర్, న్యూస్‌టుడే : మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశాన్ని ఆదివారం మురళీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-29 సం॥ వరకు అమలులో ఉండే రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షులుగా కె.లక్ష్మీపతిరాజు, జనరల్ కార్యదర్శి సైకం రాంప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ పి.వి.కృష్ణారావు, బి.కృష్ణమూర్తి, వి.పాండురంగారెడ్డి, వై.కోటేశ్వరమ్మ, పి.అప్పారావు, కె.లతాదాస్, రామకుమార్, తదితరులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాంప్రసాద్ తెలిపారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్, జాతీయ అసోసియేషన్ తరపున పరిశీలకులుగా వికాస్‌కరార్ వ్యవహరించారు.


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఘనంగా ఆర్యవైశ్య సంఘం వార్షికోత్సవం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాతనగరం ఆర్యవైశ్య యువజన సంఘం 51వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పక్కనున్న వాసవి భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు మాట్లాడారు. 1973లో నాటి ఆర్యవైశ్య ప్రముఖుడు పెనుగొండ వెంకటరావు, తదితరులు సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


నృత్యం చేస్తున్న మహిళలు

నూతన నియామకం

గురుద్వారా, న్యూస్‌టుడే: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ సౌత్ ఇండియా ఛైర్మన్‌గా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ ఆల్‌ఇండియా ఛైర్మన్ సాయిరమేశ్ నియామకపత్రం అందజేసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

మహిళలకు చీరల వితరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం స్వామి వివేకానంద సంస్థలో ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ ఆవరణలోని ఉచిత ట్యూషన్ సెంటర్ విద్యార్థులు కోలాటం, నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రతిభ చూపిన వారికి డాక్టర్ జహీర్ అహ్మద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పైడిరాజు, అప్పలకొండ, ఉమాదేవి, కనకమహాలక్ష్మి, రాణి, సుజాత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ఎంవీపీకాలనీ, న్యూస్‌టుడే: కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఉంచి దాడులు జరిపారు. ఆ సమయంలో కొంతమంది అనుమానితులను తనిఖీ చేశారు. ఐదుగురి వద్ద 29 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని సమాచారం. తదుపరి చర్యల నిమిత్తం ఐదో పట్టణ పోలీసులకు అప్పగించారు.

సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం

మురళీనగర్, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీ సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం మురళీనగర్ భజనమండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాధవధార ఈస్ట్ పార్కు నుంచి పట్టాభిరెడ్డితోట ధ్యానమందిరం వరకు జరిగిన సత్యసాయి రథం ఊరేగింపులో మాధవధార సమితికి చెందిన భీమ్‌నగర్, మురళీనగర్, మర్రిపాలెం, కంచరపాలెం, పట్టాభిరెడ్డితోట భజనమండలి సభ్యులు పాల్గొన్నారు. సత్యసాయి నామసంకీర్తన, అవతార పురుషుని దివ్య విశేషాలను మాధవధార, మురళీనగర్ సమితుల కన్వీనర్లు ఎన్.రామం, అప్పారావు తెలిపారు. బాలవికాస్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మహిళలు, సత్యసాయి భక్తులు, పదాధికారులు ఆనందోత్సాహాలతో సత్యసాయి రథం ఊరేగింపులో పాల్గొన్నారు.

భద్రతా అద్దం ధ్వంసం.. ప్రమాదాలకు ఊతం!

కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఆర్టీసీ కాంప్లెక్స్ సబ్ వేలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన భద్రతా అద్దం విరిగిపోయింది. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా వాహనాల గమనాన్ని చూపించడానికి దీన్ని ఏర్పాటు చేశారు. ఇది దెబ్బతిని నెలలైనా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ దరిపైవంతెన దిగువన ఉన్న సబ్‌వే ద్వారా అటు మద్దిలపాలెం, ఇటు జగదాంబకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ద్వారకా బస్‌స్టాండు నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు ఈ మార్గంలో వెళుతుంటాయి. ఆ సమయంలో జగదాంబ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్లే వాహనాల గమనాన్ని చోదకులు గుర్తించకపోవడంతో గతంలో ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందారు. ఈ పరిస్థితి నివారణకు ఇక్కడ అద్దాన్ని అమర్చారు. అన్ని వైపులా దృశ్యాలను అద్దం చూపించడంతో ఇక్కడ రహదారి ప్రమాదాలు తగ్గాయి.

★ జీవీఎంసీ ఆర్నెళ్ల క్రితం ఈ సబ్‌వేను ఆధునికీకరించింది. రంగులు వేయడంతోపాటు, విద్యుత్తు దీపాలను పునరుద్ధరించారు. పారిశుద్ధ్య పనులు ప్రతి రోజూ నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని మేయరు ఆదేశించారు. దీంతో సబ్‌వేలో పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి. ధ్వంసమైన భద్రతా అద్దాన్ని మళ్లీ ఏర్పాటు చేయించగలిగితే ప్రమాదాలు జరగకుండా చూడవచ్చని వాహన చోదకులు చెబుతున్నారు.


సబ్‌వేలో భద్రతా అద్దం ఇలా..

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర, కూరగాయల ధరలు తగ్గించాలని సీపీఐ కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. ఆదివారం సీతమ్మధార రైతుబజార్ సమీపంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలు తగ్గిస్తామని ఇచ్చిన హామీని విస్మరిస్తోందని అన్నారు. ధరలు నియంత్రించకుంటే ప్రజల పక్షాన పోరాటాలు తప్పవన్నారు. ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి, నాయకులు జి.మధు, తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న పడాల గోవింద్, వామనమూర్తి తదితరులు

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

గాజువాకలో కార్డన్ సెర్చ్

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: సీపీ ఆదేశాల మేరకు నగరంలో ఆదివారం పలుచోట్ల కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక 76వ వార్డులోని మండలకాలనీలో గాజువాక, దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 20 వాహనాలను గుర్తించి గాజువాక స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ పార్థసారథి, ఎస్ఐలు సూర్యకళ, మాధవరావు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సత్యసాయిబాబా అవతార ప్రకటన ర్యాలీ

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: సత్యసాయిబాబా దివ్య అవతార ప్రకటన ర్యాలీని ఉక్కునగరం పలు సెక్టార్లలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్ని సెక్టార్ల నుంచి సాగుతూ సెక్టారు-2లోని సత్యసాయిబాబా మందిరానికి చేరుకుంది. సత్యసాయి భజన మండళ్లు, భక్తులు, సమితి సేవాదళ్ సభ్యులు, యువత, బాలవికాస్, వేదబృందం, భజన గాయకులు తదితరులతో నగర సంకీర్తన జరిగింది. పలువురు సేవాదళ్ ప్రతినిధులు సారథ్యం వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న సత్యసాయి బాబా భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గోపాలపట్నం

సమస్య: 89వ వార్డు ఎల్లపువానిపాలెంలో 2ఏ/5,6,7 వీధి దీపాలు వెలగడం లేదు.

–సత్యనారాయణ, స్థానికుడు

సమాధానం: దీపాలకు మరమ్మతులు చేపట్టి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– గోవిందరావు, వీధిదీపాల నిర్వహణ

ఉద్యానవనాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం): నియోజకవర్గంలో ఉన్న ఉద్యానవనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. ఆదివారం జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో సుమారు రూ.46.95 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన పంచతత్వ ఉద్యానవనాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యానవనంలో బహిరంగ వ్యాయామశాలలు, చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు, ఆహ్లాదకరమైన పచ్చదనంతో నిర్మించామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గంలో వార్డుల వారీగా కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, పనుల విభాగం ఈఈ రత్నాకర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఉద్యానవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

రాయితీ అమ్మకాలకు ఆదరణ కరవు

సింధియా, న్యూస్‌టుడే

పారిశ్రామిక ప్రాంతం ములగాడ రైతుబజారులో రాయితీ బియ్యం అమ్మకాల దుకాణం మూణ్నాళ్ల ముచ్చటగా ఉంది.

బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరగడంతో రెండున్నర నెలల కిందట స్థానిక ములగాడ రైతు బజారులో సర్కిల్-3 పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాయితీపై అందించేందుకు ప్రత్యేక కౌంటర్‌ని ప్రారంభించారు. తొలుత విక్రయాలు బాగానే జరిగాయి. ఆ తర్వాత బహిరంగ మార్కెట్‌కు.. రాయితీ అమ్మకాల ధరల మధ్య పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో కొనుగోళ్లు మందగించాయి. దీంతో చేసేది లేక నిర్వాహకులు ఆ దుకాణాన్ని మూసివేశారు.


మూతపడ్డ రాయితీ బియ్యం దుకాణం


వంట నూనె అమ్మకాల దృశ్యం

వంట నూనెల పరిస్థితి అంతే..: ఇటీవల వంట నూనె ప్యాకెట్లను కూడా రాయితీపై అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. అయితే వీటిని కొనేందుకు రేషన్‌కార్డు/ఆధార్ కార్డును తీసుకురావాలి. చాలా మందికి సంబంధిత విషయం తెలియట్లేదని.. ఒక వేళ తెచ్చినా ఒక్కొక్కరికీ ఒక్క ప్యాకెట్ మాత్రమే విక్రయించాల్సి వస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో రైతుబజారులో వంట నూనె ప్యాకెట్ల విక్రయాలు కూడా అరకొరగానే సాగుతున్నాయని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా వీటిపై దృష్టి సారించి రాయితీ విక్రయాలు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: జీవీఎంసీ 67వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం భూమిపూజ జరిగింది. కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిలాఫలకాలు ఆవిష్కరించి కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. పల్లా మాట్లాడుతూ వార్డులో 10 ప్రాంతాల్లో సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గుత్తేదారులు సకాలంలో నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, నాయకులు పల్లా రంగా, కె.సింహాచలం, గొలగాని గోపి, చిత్రాడ అప్పారావు, వాసు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పక్కన కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ తదితరులు

సంక్షిప్త సమాచారం..

స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలి

అగనంపూడి, న్యూస్‌టుడే: సమాజంలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఉక్కు విశ్రాంత జనరల్ మేనేజరు దువ్వాడ రామప్రసాదు కోరారు. ఆదివారం అగనంపూడి సీడబ్ల్యూసీలో బాలబొమ్మల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రేరణ స్వచ్ఛంద సంస్థను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలు, ఆపదలో ఉన్న వారికి సాయం అందించడంలో సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. ఉక్కు సీఎస్ఆర్ విశ్రాంత అధికారి కె.వి.రామారావు, స్థానిక స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరావు, బి.సత్యనారాయణ, బి.కె.రామకోటి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామప్రసాదు

సమస్యలపై వినతి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం, నాతయ్యపాలెం, షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం తదితర కాలనీలోని ప్రధాన సమస్యలపై వార్డు కూటమి నాయకులు మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర తెదేపా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులకు వినతిపత్రాలు అందజేశారు. విజయవాడలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పలువురిని కలిసిన వీరు ప్రధాన సమస్యలను వివరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కూటమి నాయకులు కరణం ముత్యాలనాయుడు, కాకి తేజ, నాయకులు పాల్గొన్నారు.


విజయవాడలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు

26 నుంచి గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం (నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి నవంబరు 23 వరకు గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు నిర్వహిస్తామని సంఘం అధ్యక్షులు, కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ అన్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సంఘం అధ్యక్షులు, కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ తదితరులు

నేడు ఉక్కు సత్యాగ్రహి అమృతరావు జయంతి

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: విశాఖలో ఉక్కు కర్మాగారం సాధనకు 23 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి సాధించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు తమనంపల్లి అమృతరావు జయంతి ఉక్కునగరం స్మృత్యంజలి పార్కులో సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ నాయకులు తెలిపారు. ఉక్కు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి కళా ఉత్సవం

కరాస, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ఆదేశాల మేరకు 104 ఏరియా, శ్రీవిజయనగర్, కేంద్రీయ విద్యాలయ నెం-2లో రాష్ట్రీయ ఏక్ పర్వ్, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కళా ఉత్సవాన్ని సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణకు చెందిన కేవీ విద్యార్థులు నృత్యం, సంగీతం, నాటకం వంటి వివిధ కళారూపాల పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానాచార్యులు సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు.

అనంతుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, న్యూస్‌టుడే: ఈనెల 27వ తేదీ నుంచి పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో అనంతుని పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి తెలిపారు.

గోపాలపట్నంలో సినిమాలు

శ్రీనరసింహ: జనక అయితే గనక, నరసింహ: వేట్టయన్, సౌజన్య: విశ్వం, సుకన్య: దేవర, మౌర్య: మార్టిన్

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-2: వేట్టయన్, స్క్రీన్-3: విశ్వం, స్క్రీన్-4: దేవర, స్క్రీన్-1: జనక అయితే గనక

'టిడ్కో లబ్ధిదారులు అధైర్య పడొద్దు'

మల్కాపురం, న్యూస్‌టుడే: గతం తెదేపా హయాంలో అర్హులైన వారితో పాటు వైకాపా ప్రభుత్వంలో డీడీల నగదును వెనక్కి తీసుకోలేని లబ్ధిదారుల పత్రాలను పరిశీలించి వారందరికీ టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా అన్నారు. 63వ వార్డు చింతలలోవలో ఆదివారం వార్డు పరిధిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పత్రాల పునఃపరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కారణంతోనైనా బ్యాంకు లోన్ కాని వారి పత్రాలతో పాటు ప్రస్తుతం వార్డులోని 202 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పత్రాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీతారాం, గుడేల కృష్ణ, నర్సింగరావు, బొండ కృష్ణ, అమెరికా శ్రీను, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

గ్యార్మీ షరీఫ్ ర్యాలీ

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం తాహా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ సందర్భంగా ఆదివారం స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్లాం శాంతి మార్గాన్ని చూపిస్తుందని, సర్వ మానవాళి శాంతితో జీవితం గడపాలనేది ఆకాంక్షని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

సింధియా (నెహ్రూనగర్), న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం స్థానిక నెహ్రూనగర్‌లో ఆదివారం ఆంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు జరిపారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గణబాబు హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక జ్ఞాపిక అందజేశారు. రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.


శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు

వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

అక్కిరెడ్డిపాలెం (బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఏవీఎస్ఎన్ గుప్తా అన్నారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం అక్కిరెడ్డిపాలెం-నాతయ్యపాలెం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. మెడికవర్ ఆసుపత్రి, పుష్పగిరి కంటి ఆసుపత్రి, రీచ్ హెల్త్ ఆక్యుపంక్చర్ వైద్య కేంద్రం సాయంతో గుండె సమస్యలు, బీపీ, బరువు, క్యాన్సర్ సంబంధిత సమస్యలు, చెవి వినికిడి, కంటి సమస్యలపై ఉచిత పరీక్షలు జరిపి మందులు అందజేశారు. సుమారు 600 మంది వరకు పరీక్షలు చేయించుకున్నారు. పలువురికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసేందుకు అంగీకరించారు. క్లబ్ ప్రతినిధులు కట్టా సతీశ్, నున్న గాంధీగుప్తా, జి.కుమారస్వామి, శ్రీరామ్మూర్తి, వి.కుమారగుప్తా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న వాసవీ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు

'ఉక్కు ప్రయివేటీకరణ సహించం'



నిరసనలో పాల్గొన్న భెల్ సిటూ కార్మిక నాయకులు

అక్కిరెడ్డిపాలెం (షీలానగర్), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిటూ నాయకులు ఎస్.జగన్నాథరావు అన్నారు. ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నగరంలోని జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు సిటూ నాయకులు ఆదివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉక్కును ప్రైవేటీకరణ చేయట్లేదని కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలన్నారు. నాయకులు నారపురెడ్డి, బీఎస్ఎన్ రాజు, కె.కామేశ్వరరావు, సీతామహాలక్ష్మి, అచ్చెన్నాయుడు, కనకారావు, కృష్ణమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 89వ వార్డు భగత్‌సింగ్‌నగర్, కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుడికి సూచించారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటరమేశ్

చురుగ్గా భాజపా సభ్యత్వ నమోదు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక నియోజకవర్గంలో భాజపా సభ్యత్వ నమోదు 30 వేలకు పైగా తప్పక అవుతుందని గాజువాక నియోజకవర్గ భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఆదివారం జీవీఎంసీ 70వ వార్డులోని పలు ప్రాంతాల్లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో నమోదు ఇన్‌ఛార్జి దీనకొండ కృష్ణంరాజుతో కలిసి పాల్గొన్నారు. పలువురికి పార్టీ సభ్యత్వం నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పార్టీ విధానాలు, అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నామన్నారు. ఇప్పటికే సుమారు 23 వేల సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు పావని, శ్రీను, రంజిత్, అనురాగ్‌సింగ్, రాహుల్ షా, జగదీశ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న భాజపా గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన


ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సంఘం సభ్యులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వినియోగించడంతో పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. మటన్, చికెన్ దుకాణాలకు స్టీల్‌బాక్సులతో వచ్చిన వినియోగదారుడికి కిలో మాంసం దగ్గర రూ.20లకు తగ్గించే విధంగా వర్తకులతో మాట్లాడి ఒప్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

ఫోకస్


జీవీఎంసీ 90, 92 వార్డుల్లో విద్యుత్తు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, పద్మనాభనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలపై పాదులు అల్లుకున్నాయి. గాలులు వీచినప్పుడు రాపిడి ఏర్పడి నిప్పులు చెలరేగడం, విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాదులను తొలగించాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి


పద్మనాభనగర్‌లో..


లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న పాదులు

బట్రాజుల సంక్షేమానికి కృషి


సతీష్‌ను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు హరనాథరాజు, ఓంకారం రాజా

కూర్మన్నపాలెం: ఆర్థికంగా వెనుకబడిన బట్రాజుల సంక్షేమానికి కృషి చేస్తామని విశాఖ బట్రాజు సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.హరనాథరాజు అన్నారు. ఆదివారం కూర్మన్నపాలెంలో జరిగిన కార్యక్రమంలో 100 మంది బీమాకు ఆర్థిక సాయం అందించిన సంఘం ఉపాధ్యక్షులు సీహెచ్‌సీఎస్‌వీ రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో సంఘం మరింత బలోపేతం చేస్తామన్నారు. సంఘం ప్రతినిధులు ఓంకారం రాజా, జేవీఆర్‌జీపీ వర్మ, పి.మోహన్‌రాజు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి

షిప్‌యార్డుకాలనీ (మల్కాపురం) న్యూస్‌టుడే: పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలంటూ సీపీఐ పశ్చిమం సమన్వయకర్త కాండ్రేగుల సత్యాంజనేయ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రాం హిందుస్థాన్ షిప్‌యార్డుకాలనీలో ఉన్న వారపు సంతలో ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటనూనె, ఆకుకూరలు, కూరగాయలు, ఇతర పప్పులు వంటి ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.రాంబాబు, గోపి, త్రినాథ్, కనకరాజు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న సీపీఐ నాయకులు

విరివిగా మొక్కలు నాటుదాం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు పాటుపడాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.నాగభూషణం అన్నారు. ఆదివారం తిరుమలనగర్‌లో కేవీకే సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కల పెంపకం వల్ల కాలుష్యం నుంచి బయట పడవచ్చునన్నారు. కాలనీలో సుమారు 3 వేల మొక్కలు పెంచామని, మరిన్ని నాటేందుకు ఆశావహులు, దాతలు ముందుకు వస్తున్నారని తెలిపారు. కేవీకే సత్యసాయి సేవా సమితి, ధ్యాన మందిరం ప్రతినిధులు, కాలనీ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందరం, రమేష్, తిరుపతినాయుడు, సన్యాసిరావు, రాము, భాస్కరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.


తిరుమలనగర్‌లో మొక్కలు నాటుతున్న కేవీకే సత్యసాయి సేవా సమితి, తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు